E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
19 - 04-2025 శనివారం | పేజీలు–6 | హైదరాబాద్
ekaburu.com


2లో

జేఈఈ (మెయిన్) సెషన్2 ఫైనల్ కీ విడుదల.. రిజల్ట్స్ ఎప్పుడంటే?


2లో

## ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ ఫోన్ కాల్

**టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌తో భారత ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. సాంకేతికత, నూతన ఆవిష్కరణల్లో భాగస్వామ్యం గురించి వారు చర్చించారు.**


3లో

## రజాకార్ల గురించి ఇంకెన్నాళ్లు మాట్లాడతారు?: మహేశ్‌కుమార్ గౌడ్


3లో

## నెల వ్యవధిలోనే.. 1000 మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు!

**గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను అమెరికా రద్దు చేసినట్లు సమాచారం**


3లో

## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?: కిషన్‌రెడ్డి

3లో

## అమిత్‌షా కలలు ఫలించవు: సీఎం స్టాలిన్

# బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై సమీక్ష



**ఈ కబురు, తెలంగాణ బ్యూరో:**
బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇందుకు ఉత్తర తెలంగాణను కేంద్రంగా ఎంచుకున్నారు. అందులో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లపై కేసీఆర్ శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఎర్రవల్లిలోని ఫాంహౌజ్‌లో సమావేశం అయ్యారు. బహిరంగ నేపథ్యంలో అక్కడి నేతలు చేస్తున్న ఏర్పాట్లపై అధినేత సంతృప్తి వ్యక్తం చేశారు. ఏర్పాట్లు బాగున్నాయని కొనియాడుతూనే.. మరికొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు.

**400 మంది కూర్చునేలా వేదిక**
రజతోత్సవం సభ కోసం స్థానిక నేతలు అధినేత సూచనల మేరకు నార్త్ ఫేసులో వేదికను ఏర్పాటు చేస్తున్నారు. 8 ఫీట్ల ఎత్తులో వేదికను నిర్మిస్తుండగా.. 400 మంది కూర్చుండేలా వేదికను తయారు చేస్తున్నారు. ఇందుకోసం 159 ఎకరాలను సిద్ధం చేశారు. గతంలో ఏ పార్టీ సైతం నిర్వహించని రీతిలో సభను నిర్వహించాలని అధినేత సూచించడంతో.. ఆ స్థాయిలో సభా వేదికను సైతం సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా కళాకారుల కోసం ప్రత్యేక స్టేజీని సైతం నిర్మిస్తున్నారు.

మరోవైపు.. మహిళలకు ఎక్కడా అసౌకర్యం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వారి కోసం సెపరేట్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని కేసీఆర్ సూచించారు. సభకు వచ్చిన వారికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు.

**3,000 డ్రమ్ములు.. 10 లక్షల వాటర్ బాటిల్స్**
అసలే ఎండాకాలం కావడం.. సభకు వచ్చిన వారు దాహంతో ఇబ్బందులు పడకుండా భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. దాహార్తిని తీర్చేందుకు 10 లక్షల వాటర్ బాటిల్స్‌తోపాటు 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో పెట్టాలని స్థానిక నేతలకు అధినేత కేసీఆర్ సూచించారు. అంతేకాకుండా.. కూల్ వాటర్ అందించేలా 3వేల డ్రమ్ములను అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. నీటి కొరత అనేది ఏర్పడకుండా చూడాలన్నారు. అలాగే.. అనుకోకుండా ఎవరైనా అనారోగ్యానికి గురైనా.. ప్రమాదానికి గురైనా ఫస్ట్ ఎయిడ్ అందించేలా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ర్యాంపులు**
మరోవైపు.. భారీ ఎత్తున నిర్వహిస్తున్న సభ కావడంతో సభకు వచ్చే వారితో ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేసీఆర్ సూచించారు. ఎక్కడా వాహనాల రాకపోకలు ఇబ్బందులు తరువాయి 2లో



# టోక్యో నుండి తెలంగాణకు టెక్నాలజీ పాఠాలు

- ఇండియా-జపాన్ భాగస్వామ్య రోడ్‌షోలో సీఎం రేవంత్ పాల్గొనడంతో ఆసక్తి జపాన్‌లోని దిగ్గజ కంపెనీలతో తెలంగాణ బృందం కీలక సమావేశాలు.
- హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో మోడల్ ప్రేరణగా మారింది ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులపై ప్రచార వీడియోలు ప్రదర్శన.
- ఏఐ డేటా సెంటర్ క్లస్టర్‌కి రూ. 10,500 కోట్ల పెట్టుబడి ఒప్పందం ఎన్‌టీటీ డేటా, నెయిసా సంయుక్తంగా హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటు.
- తోషిబా సంస్థ రుద్రారంలో రూ. 562 కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు టీటీడీఐతో విద్యుత్ రంగంలో పెట్టుబడి, ఆవిష్కరణల ఒప్పందం.
- తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం – సీఎం హర్షం నిపుణులు, సింగిల్ విండో విధానం, నాణ్యమైన విద్యుత్ సరఫరా పెట్టుబడుల ఆకర్షణకు కేంద్రబిందువు.

**ఈ కబురు,టోక్యో:**
జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టోక్యోలో నిర్వహించిన ఇండియాజపాన్ భాగస్వామ్య రోడ్‌షోలో పాల్గొన్నారు. జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశమైంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూలతలను వివరించారు. లైఫ్ సైన్సెస్, జీసీసీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈవీ, టెక్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం ప్రచార వీడియోలను రేవంత్ బృందం ప్రదర్శించింది. హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్, జపాన్ కలిసి ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్ నిర్మిద్దామని పిలుపునిచ్చారు . తరువాయి 2లో

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం



**ఈ కబురు, హైదరాబాద్:**
నగరంలో భారీ వర్షం కురిసింది బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, ఎస్ఆర్ నగర్, మాదాపూర్, ఫిలింనగర్, గచ్చిబౌలి, అత్తాపూర్, నార్సింగి, కోకాపేట్, కోఠి, నాంపల్లి, అబిడ్స్ దిల్‌సుఖ్‌నగర్, రాజేంద్రనగర్, అంబర్‌పేట్, ఉప్పల్, సికింద్రాబాద్, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో దంచికొట్టింది. పలు ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుపై చెట్టు కూలిపోయింది. లంగర్‌హౌస్‌లో విద్యుత్ తీగలపై భారీ వృక్షం పడింది. నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌పై భారీ వృక్షం పడిపోయింది. కంచన్‌బాగ్ 8, బహదూర్‌పురాలో 7.8 సెం.మీ, 2లో



## భూభారతితో అన్నదాత కష్టాలు తీరుస్తాం

- దొరగారి ధరణితో పాతాళానికి రైతులు
- భూభారతి అవగాహన సదస్సులో పొంగులేటి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ధరణి కష్టాల గురించి చెప్పారు
- మేం ఏం చేసినా ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి
- ఇప్పటికైనా మారకుంటే లోక్‌సభ ఫలితాలే పునరావృతమవుతాయి
- కళ్లుండి చూడలేని ప్రతిపక్షాలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాయి. అసెంబ్లీలో ఈ చట్టం ఆమోదం కోసం పెట్టినప్పుడు ఇంగిత జ్ఞానం కూడా లేకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాయి.

2లో

## కర్ణాటకలో రోహిత్ వేముల చట్టం చేయాలి: రాహుల్ గాంధీ

**ఈ కబురు:** ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళిత విద్యార్థులెవరూ అటువంటి వివక్షను ఎదుర్కోకుండా ఉండాలంటే 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించి.. అమలు చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. నేటికి కూడా మన విద్యావ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటని రాహుల్ పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ జీవితంలో ఎదుర్కొన్న కుల వివక్ష గురించి ఈ లేఖలో రాసుకొచ్చారు.

వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేడ్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు.



దిల్లీ పరిపాలనకు తమిళనాడు తలొగ్గదు: స్టాలిన్
2016 జనవరి 17న హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడు. యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాల వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని దళిత సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమించాయి. విద్యాసంస్థల్లో దళిత విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రోహిత్ చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. అతడు ఆత్మహత్య చేసుకున్న ఎనిమిదేళ్ల తర్వాత మృతుడి తల్లి విజ్ఞప్తి మేరకు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసుపై పునర్విచారణ ప్రారంభించింది.



## కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే విచారణ చేపట్టాలి: ప్రధానికి కేటీఆర్ విజ్ఞప్తి

**ప్రధాని నరేంద్రమోదీ కి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు.**

**ఈ కబురు,హైదరాబాద్:**
ప్రధాని నరేంద్రమోదీ కి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధానిగా పర్యావరణంపై చిత్తశుద్ధిని 2లో



## ఛత్తీస్‌గఢ్‌లో 22 మంది మావోయిస్టుల అరెస్ట్.. భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

**ఈ కబురు, నేషనల్ బ్యూరో:**
ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ లో 22 మంది నక్సలైట్లను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. జిల్లాలోని మూడు ప్రాంతాల నుంచి వీరందరినీ అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు గురువారం వెల్లడించారు. జిల్లాలో నిర్వహిస్తున్న నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా మంగళవారం ఉసర్ పోలీస్ స్టేషన్ నుంచి స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన భద్రతా బలగాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే టెక్మెట్ల గ్రామ సమీపంలోని అడవిలో ఏడుగురిని, బెల్చార్ గ్రామంలోని కోటల నుంచి ఆరుగురు నక్సలైట్లను, నెలస్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కందకర్కా అటవీ ప్రాంతంలో మరో తొమ్మిది మంది మావోయిస్టు సభ్యులను అరెస్ట్ చేశారు.
మావోయిస్టుల వద్ద నుంచి టిఫిన్ బాంబులు, కార్డెక్స్ వైర్, డిటోనేటర్లు, విద్యుత్ వైర్లు, బ్యాటరీలు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ లో భద్రతా సిబ్బందికి సంబంధించిన ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. కాగా, ఈ ఏడాది ఛత్తీస్ గఢ్‌లో జరిగిన వివిధ ఎన్ కౌంటర్లలో 140 మంది మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. దీంతో తాజా పరిణామంతో మావోయిస్టులకు భారీ షాక్ తగిలినట్టు అయింది.



# జేఈఈ (మెయిన్) సెషన్2 ఫైనల్ కీ విడుదల.. రిజల్ట్స్ ఎప్పుడంటే?

**జేఈఈ (మెయిన్) సెషన్- 2 పరీక్షల తుది కీ విడుదలైంది.**


**ఈ కబురు:** జేఈఈ (మెయిన్) సెషన్ 2 పరీక్షల తుది కీ మళ్లీ విడుదలైంది. తొలుత గురువారమే జేఈఈ (మెయిన్) రెండో సెషన్ పేపర్ 1కు సంబంధించిన తుది కీని జాతీయ పరీక్షల మండలి(NTA)విడుదల చేసినప్పటికీ.. కొద్దిగంటల్లోనే తొలగించింది. ఇందుకు కారణమేంటో తెలపకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర గందరగోళానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఎన్‌టీఏ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం మరోసారి తుది కీని విడుదల చేసిన ఎన్‌టీఏ.. ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నలను (ఐడీలు: 347577562, 347577939) విరమించుకున్నట్లు పేర్కొంది.

**జేఈఈ మెయిన్ సెషన్ 2 ఫైనల్ కీ కోసం క్లిక్ చేయండి**

మరోవైపు, జేఈఈ మెయిన్ పరీక్షల షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం ఏప్రిల్ 17 నాటికి ఫలితాలు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ.. నిర్ణీత గడువులోగా రిజల్ట్స్ ఇవ్వడంలోనూ NTA విఫలమైందంటూ విమర్శలు వస్తున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం స్పందించిన ఎన్‌టీఏ.. శనివారం లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. అలాగే, ఈ మధ్యాహ్నం 2గంటల కల్లా తుది కీ విడుదల చేస్తామని ప్రకటించడంతో విద్యార్థులు ఎదురుచూశారు. అయితే, తుది కీని సైతం చెప్పిన సమయం కన్నా గంటకు పైగా ఆలస్యంగా విడుదల చేయడంతో ఎన్టీఏ అధికారుల తీరుపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

'మధ్యాహ్నం 2గంటల వరకు ఎదురుచూశాం. ఆ సమయం అయిపోయింది. ఏదైనా అప్‌డేట్ ఉందా? అని ఒకరు పోస్టు పెట్టగా.. మీరు ఇచ్చిన కమిట్‌మెంట్ ప్రకారం ఈ మధ్యాహ్నం 2గంటలకు తుది కీ విడుదల చేయాలి. కానీ, ఇప్పటివరకు వెబ్‌సైట్‌లో ఎలాంటి అప్‌డేట్ లేదు. ఏం జరుగుతుందో దయచేసి నిర్ధారిస్తారా?' అని మరొకరు పోస్టు చేశారు. ఎన్‌టీఏ.. జేఈఈ మెయిన్స్‌ను సరిగ్గా నిర్వహించడం మీకు(NTA) అసాధ్యమని అంగీకరించాల్సిందే. ఎన్‌టీఏ నుంచి ఆ బాధ్యతను తీసుకొని వేరొకరికి అప్పగించాలని పీఎంవోకి నా విజ్ఞప్తి' అని మరొకరు పోస్టు పెట్టగా.. 'బహుశా ఎన్‌టీఏ అధికారులు వేరే గడియారం వాడుతున్నారేమో' అని మరొకరు 'ఎక్స్'లో అసహనం వ్యక్తపరిచారు.

దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో పేపర్ 1 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 11న ప్రాథమిక కీ విడుదల చేసిన ఎన్‌టీఏ.. ఈ నెల 13వరకు అభ్యంతరాలను స్వీకరించింది. రెండో విడత పరీక్షలకు దాదాపు 10లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. జేఈఈ మెయిన్ ఫలితాలను https://jeemain.nta.nic.in/ద్వారా తెలుసుకోవచ్చు.



# ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ ఫోన్ కాల్

**ఈ కబురు,ఢిల్లీ:** టారిఫ్‌ల విషయంలో భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డోజ్ విభాగ అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో చర్చలు జరిపారు. ఈ విషయాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

''టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌తో పలు అంశాలపై మాట్లాడా. ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్‌లో భేటీ సందర్భంగా చర్చకు వచ్చిన అంశాలనూ మేం ప్రస్తావించాం. సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న ప్రాముఖ్యతపై చర్చించాం. ఈ రంగాల్లో అమెరికాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉంది'' అని మోదీ రాసుకొచ్చారు.

ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా, స్టార్‌లింక్ ఇంటర్నెట్ సంస్థలు భారత మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఆసక్తి చూపుతున్న వేళ వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రధానితో మస్క్ భేటీ అయ్యారు. అంతరిక్షం, మొబిలిటీ, టెక్నాలజీ వంటి రంగాలపై వీరిద్దరూ చర్చలు జరిపారు. ఈ భేటీ జరిగిన కొన్ని రోజులకే.. భారత్‌లో టెస్లా నియామక ప్రక్రియ ప్రారంభించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఇక, షోరూం ఏర్పాటు కోసం స్థలం ఎంపికపైనా మస్క్ సంస్థ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

మరోవైపు, మన దేశంలో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో, సునీల్ భారతీ మిత్తల్‌కు చెందిన భారతీ ఎయిర్‌టెల్ ఒప్పందం చేసుకున్నాయి. అయితే, స్టార్‌లింక్‌కు భారత్ ఇంకా అనుమతులు మంజూరు చేయలేదు. ఈ క్రమంలోనే ఆ సంస్థ ప్రతినిధుల బృందంతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల సమావేశమయ్యారు. స్టార్‌లింక్‌కు ప్రస్తుతమున్న భాగస్వామ్యాలు, భారత్‌లో భవిష్యత్ పెట్టుబడులు ప్రణాళికపై చర్చలు జరిపారు.

## టోక్యో నుండి తెలంగాణకు

# టెక్నాలజీ పాఠాలు

మొదటి పేజి తరువాయి

**హైదరాబాద్‌లో భారీ స్థాయిలో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం**

జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులను సాధించింది. రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా సంస్థలు సంయుక్తంగా ఈ డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందాలపై ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. మరోవైపు రుద్రారంలో రూ.562 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటుకు తోషిబా ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే తోషిబా అనుబంధ సంస్థ టీటీడీఐ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలకు ఈ ఒప్పందం జరిగింది. రుద్రారంలో ఇప్పటికే ఈ సంస్థ రెండు ఫ్యాక్టరీలను నిర్వహిస్తోంది. ఈ భారీ పెట్టుబడులపై సీఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు.

''రాష్ట్ర ప్రభుత్వ విధానాలు భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పెట్టుబడులు వస్తున్నాయి. తెలంగాణలో సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం ఇస్తోంది. నిపుణులు ఉన్నందున ఏఐ డిజిటల్ సేవల్లో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోంది. ఎన్‌టీటీ భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం సుస్థిరంగా ఉంటుంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



## బీఆర్ఎస్ రజతోత్సవ సభ

# ఏర్పాట్లపై సమీక్ష




మొదటి పేజి తరువాయి

రాకుండా చూసుకోవాలన్నారు. వెహికిల్స్ రాకపోకలకు 16 కిలోమీటర్ల అప్రోచ్ రోడ్డు నిర్మిస్తుండగా.. ఇప్పటికే 8 కిలో మీటర్ల నిర్మాణం పూర్తయినట్లు వరంగల్ నేతలు చెప్పారు. దాంతో కేసీఆర్ వారిని అభినందించారు. అప్రోచ్ రోడ్డుతోపాటే ఒకేసారి నిమిషానికి 600 వెహికిల్స్ దిగేలా పెద్ద ఎత్తున ర్యాంపులు ఏర్పాటు చేయాలని వారికి సూచించారు. ట్రాఫిక్ జామ్ లేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. పార్కింగ్ కోసం కూడా అనువైన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే.. 300 చోట్ల హైమాస్ట్ ఏర్పాటు చేయాలని నేతలకు సూచించారు. వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. టెంపరరీ టాయిలెట్స్ పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఒడితెల సతీష్‌కుమార్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, పార్టీ మహిళా నేతలు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

**మొదటి పేజి తరువాయి**

యాకూత్‌పురాలో 7.6, బేగంబజార్‌లో 6.9 సెం.మీ, సంతోష్‌నగర్ 6.9, దబీర్‌పురాలో 6.6 సెం.మీ వర్షపాతం నమోదైంది.

తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం ఎండలు, సాయంత్రానికి వర్షాలు.. ఈదురుగాలులు, వడగళ్ల వానలతో జనం పరేషాన్ అవుతున్నారు. ఉత్తర మధ్య మహారాష్ట్ర నుంచి మరత్వాడ, అంతర్గత కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ మన్నార్ వరకు సముద్ర మట్టం మీదగా ద్రోణి కొనసాగుతోంది. రాష్ట్రంలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. క్యుములోనింబస్ మేఘాలు కమ్ముకొని అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఇవాళ ఉరుములు, మెరుపులు, గంటకు 3040 కి.మీతో వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుందని పేర్కొంది. రాష్ట్రంలో కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడ కురిసి అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. వచ్చే మూడు, నాలుగు రోజులు అధిక ఎండలు నమోదయ్యే అవకాశం ఉందని పలు ఉత్తర, ఈశాన్య జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

# కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే విచారణ చేపట్టాలి: ప్రధానికి కేటీఆర్ విజ్ఞప్తి

**మొదటి పేజి తరువాయి**

నిరూపించుకోవాల్సిన సమయమిదన్నారు. ఈ మేరకు 'ఎక్స్' ద్వారా ప్రధానిని ఆయన కోరారు.

''కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టాలి. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలి. దీనిపై ప్రధాని వ్యాఖ్యలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాలి. కంచ గచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10వేల కోట్ల ఆర్థిక మోసం. దీనిపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు ఆధారాలతో సహా తెలిపాం. ఆర్థిక అవకతవకల అంశాన్ని కేంద్ర సాధికార కమిటీ నిర్ధరించింది. స్వతంత్ర విచారణ చేయాలని సూచించింది. దీనిపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి'' అని కేటీఆర్ కోరారు.

# భూభారతితో అన్నదాత కష్టాలు తీరుస్తాం

**ఈ కబురు,ఖాజీపూర్ నుంచి సాక్షి ప్రతినిధి**



బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక కష్టాలు అనుభవించారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రైతుల కష్టాలు తీర్చేందుకే ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం అమలులో భాగంగా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం ఖాజీపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. 'నాడు దొరవారు చేసిన ధరణి చట్టం పేద ప్రజలను, రైతులను పాతాళానికి తొక్కింది. ఇప్పుడు మేం తెస్తున్న భూభారతి చట్టం రైతుకు, భూమికి మధ్య ఉండే బంధాన్ని బలోపేతం చేస్తుంది. గ్రామాలు, గూడేలు, తండాల్లో ఉండే పేదలకు భరోసా, వారి భూములకు భద్రత ఉండేలా ఈ చట్టం తీసుకొస్తున్నాం'అని వివరించారు.

**పింక్ చొక్కాల కష్టాలూ తీరుస్తాం**

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను 15 నెలల్లోనే కాంగ్రెస్ చేసిందన్న అక్కసుతోనే ప్రతి పనికి ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని మంత్రి పొంగులేటి విమర్శించారు. 'వాళ్లు మమ్మల్ని తిట్టినా, ఆడిపోసుకున్నా సరే.. పింక్ చొక్కాలు వేసుకున్నవారి భూ సమస్యలను కూడా భూభారతి ద్వారా పరిష్కరిస్తాం. నేను అసెంబ్లీలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే నా దగ్గరకు వచ్చి ధరణి పోర్టల్ వల్ల తమ పాసు పుస్తకాల్లో తప్పులు వచ్చాయని తెలిపారు.

భారతికి బదులు భరత్‌రెడ్డి అని, 9 ఎకరాలకు బదులు 9 గుంటలు అని పడిందని, వాటిని కొత్త చట్టం ద్వారా సరిచేయాలని కోరారు. దేశానికి భూభారతి చట్టం రోల్‌మోడల్ కాబోతోంది. పింక్ చొక్కాలు వేసుకున్న వారు గతంలో పేదలకు చెందిన లక్షలాది ఎకరాల భూమిని కొల్లగొట్టారు. ఆ భూములన్నింటిని తిరిగి పేదలకు పంచాలనేది మా ఉద్దేశం. అసైన్డ్ భూములపై కూడా రైతులకు హక్కులు కల్పిస్తాం. కోర్టుల్లో లేని ప్రతి భూ సమస్యకు భూభారతి ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుంది'అని తెలిపారు.

**మంచిని మంచి అని చెప్పకపోయినా.. చెడుగా చిత్రీకరించొద్దు..**

మా ప్రభుత్వానికి మంచి మార్కులు వస్తాయనే అక్కసుతోనే మేం ఏం చేసినా అడ్డుకునే ధోరణితో ప్రతిపక్షాలు ముందుకెళుతున్నాయని పొంగులేటి విమర్శించారు. 'కళ్లుండి చూడలేని ప్రతిపక్షాలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాయి. అసెంబ్లీలో ఈ చట్టం ఆమోదం కోసం పెట్టినప్పుడు ఇంగిత జ్ఞానం కూడా లేకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాయి. రైతునని చెప్పుకునే నాయకుడు తెచ్చిన చట్టం ద్వారా ప్రజలు ఎంత గోస పడ్డారో ఇంకా వారికి అర్థం కావడం లేదు. మంచిని మంచి అని చెప్పకపోయినా చెడుగా చిత్రీకరించే ప్రయత్నం చేయవద్దు.

**ఇప్పుడు కూడా బీఆర్ఎస్ తన విధానం మార్చుకోకపోతే పార్లమెంటు ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయి'అని హెచ్చరించారు. సదస్సులో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్‌లు భూభారతి చట్టంలోని ముఖ్యాంశాలను రైతులకు వివరించారు. అక్కడే ఏర్పాటు చేసిన కౌంటర్‌లో రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ధరణి పోర్టల్ వల్ల తాను కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. తన భూమి పాసుపుస్తకంలో వాకిటికి బదులుగా వాకాటి అని వచ్చిందని, దానిని మార్చాలని అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు.**

**తన నియోజకవర్గంలో ఇక నుంచి భూభారతి చట్టంలోని సెక్షన్ల గురించి రైతులకు వివరిస్తానని పేర్కొన్నారు. భూమి సునీల్ మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని 1.30 కోట్ల మంది రైతుల శ్రేయస్సే లక్ష్యంగా చట్టం మార్చామని చెప్పారు. సదస్సులో ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.**



# హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు జవాబివ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.**

**ఈ కబురు,హైదరాబాద్:**
హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు జవాబివ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బేగంపేటలో ఎమ్మెల్సీ ఎన్నికపై నిర్వహించిన భాజపా సన్నాహక భేటీలో ఆయన మాట్లాడారు. మజ్లిస్‌కు వ్యతిరేకంగా భాజపా పోరాటం చేస్తోందన్నారు. తమ పార్టీని ఓడించే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్, భారాస పనిచేస్తున్నాయని విమర్శించారు. భాజపాను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేదన్నారు. కాంగ్రెస్, భారాస.. మజ్లిస్ కనుసన్నల్లో ఉన్నాయని మండిపడ్డారు.

“ రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నా హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఎందుకు పోటీ చేయడం లేదో రాహుల్ గాంధీ చెప్పాలి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన భారాస.. ఇప్పుడు ఎందుకు బరిలో దిగడం లేదు? మూడు కుటుంబ పార్టీలు కుమ్మక్కై భాజపాను ఓడించాలని చూస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉన్నచోటే భారాస ప్రభుత్వం అభివృద్ధి చేసింది. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే ఈ నగరం అభివృద్ధి చెందుతుంది. మోదీ చేస్తున్న కృషి వల్లే ఇక్కడికి పరిశ్రమలు వస్తున్నాయి. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ ఒక్కటే కాదు.. అంబర్ పేట, ఖైరతాబాద్, నాంపల్లి కూడా నగరంలో భాగమే. కాంగ్రెస్ పార్టీ పట్ల ఎలా ఉండాలనేదానిపై కేటీఆర్ సర్టిఫికెట్ భాజపాకు అవసరం లేదు’’ అని కిషన్‌రెడ్డి తెలిపారు.



# మన్నెవారిపల్లి వైపు నుంచి తవ్వకానికి రంగం సిద్ధం

**శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగమార్గం తవ్వకం పనులను మన్నెవారిపల్లి వైపు నుంచి చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. నల్గొండ జిల్లాకు తాగు, సాగు నీటిని అందించాలనే లక్ష్యంతో మొత్తం 43.931 కిలోమీటర్ల పొడవు సొరంగమార్గం పనులు చేపట్టేందుకు 2005లో పనులను ప్రారంభించారు.**
**రెండేళ్లకు ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు చేరుకున్న బేరింగ్**
**టీబీఎంకు బిగించిన తర్వాత ప్రారంభం కానున్న పనులు**
**టన్నెల్ ముఖద్వారం వద్ద క్రేన్ సాయంతో భారీ బేరింగ్‌ను లారీ నుంచి దింపుతున్న సిబ్బంది**

**అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే:**
శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగమార్గం తవ్వకం పనులను మన్నెవారిపల్లి వైపు నుంచి చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. నల్గొండ జిల్లాకు తాగు, సాగు నీటిని అందించాలనే లక్ష్యంతో మొత్తం 43.931 కిలోమీటర్ల పొడవు సొరంగమార్గం పనులు చేపట్టేందుకు 2005లో పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట (శ్రీశైలం డ్యాం) వైపు నుంచి (ఇన్‌లెట్) 13.936 కిలోమీటర్ల వరకు పనులు పూర్తి కాగా.. కృష్ణా నది జలాలు ఉబికి వస్తున్న కారణంగా 2019 నుంచి పనులు నిలిచిపోయాయి. అచ్చంపేట మండలంలోని మన్నెవారిపల్లి వైపు నుంచి (ఔట్‌లెట్) 20.435 కిలోమీటర్ల మేరకు పనులు పూర్తయ్యాయి. 2023లో టన్నెల్ బోరింగ్ యంత్రం (టీబీఎం) బేరింగ్ చెడిపోవడంతో రెండేళ్లుగా పనులు కొనసాగడంలేదు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 22న దోమలపెంట వైపు ఇన్‌లెట్ 13.936 కిలోమీటరు వద్ద టన్నెల్‌లో పనులు ప్రారంభించిన నాలుగు రోజులకే ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో టీబీఎం పూర్తిగా ధ్వంసం కావడంతో పనులు చేసేందుకు అవకాశం లేకుండాపోయింది. మరో మూడున్నరేళ్లలో ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయడమే లక్ష్యంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పనులను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దోమలపెంట వైపు నుంచి టన్నెల్ తవ్వడం ఆపేసి మన్నెవారిపల్లి వైపు నుంచి పనులను ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గత మార్చి 2న దోమలపెంట టన్నెల్ వద్ద ప్రకటించారు. ఇదిలా ఉండగా.. రెండేళ్ల క్రితం చెడిపోయిన టీబీఎం బేరింగ్ స్థానంలో కొత్తదాన్ని అమెరికాలో కొనుగోలు చేశారు. అమెరికా నుంచి చెన్నైకి ప్రత్యేక నౌకలో, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో భారీ వాహనంలో శుక్రవారం మన్నెవారిపల్లిలోని టన్నెల్ ముఖద్వారం వద్దకు కొత్త బేరింగ్‌ను తరలించారు. దాన్ని టీబీఎంకు బిగించి జియోలాజికల్ సర్వే అనంతరం పనులు ప్రారంభించనున్నారు. మధ్యలో నిలిచిపోయిన మరో 9.559 కిలోమీటర్ల మేర సొరంగమార్గం తవ్వకం పూర్తి కావాల్సి ఉంది.



స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న డైమండ్ హిట్స్ వాసులు



పరిసరాలను శుభ్రం చేస్తున్న రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి

# ఎన్నిక ఏదైనా కాషాయ జెండా ఎగరడం ఖాయం : రవికుమార్ యాదవ్

**గోపన్ పల్లిలో గావ్ ఛలో – బస్తీ ఛలో కార్యక్రమం పాల్గొన్న శేరిలింగంపల్లి ఇంచార్జి రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల సందర్భంగా, బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గచ్చిబౌలి డివిజన్ గోపనపల్లిలోని మంజీరా డైమండ్ హైట్స్ లో స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు శివ సింగ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డితో కలిసి రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రపరిచి, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డిలు మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలు చూపడం, వారి అభివృద్ధికి తోడ్పడడమే తమ బాధ్యత అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలల్లో ప్రజలకు చేసింది ఏమి లేక రాజ్యాంగం ముసుగులో రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని, అసలు రాజ్యాంగంలో ఏమేమి ఉంటాయో తెలియని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనను చూసి ప్రజలు విసుగు చెందారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడిగొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీకి వెన్నెముకైనా కార్యకర్తలు రాబోయే రోజుల్లో స్థానికంగా ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల కోసం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, సీనియర్ నాయకులు వసంత కుమార్ యాదవ్, రంజిత్ పూరి, హనుమంత్ నాయక్, కిషన్ గౌలి, ప్రభాకర్, తిరుపతి, రాజు, గోవింద, మహేష్, సీనియర్ నాయకురాలు. వరలక్ష్మి ధీరజ్, మంజీర డైమండ్ హైట్స్ వాసులు అతుల్ పీఎల్ రావు, సుమంత్, అర్జున్, వరప్రసాద్, మదన్, క్రాంతి, రఘు, ఉదయలక్ష్మి, శశి, ప్రియ, తులసి, హేమ, శ్రీలక్ష్మి, రజినీ తదితరులు పాల్గొన్నారు.

# నెల వ్యవధిలోనే.. 1000 మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు!

**గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను అమెరికా రద్దు చేసినట్లు సమాచారం.**



**ఈ కబురు:** అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపుతున్నారు. గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేసినట్లు సమాచారం. దీంతో ట్రంప్ యంత్రాంగం తీరుపై అనేక మంది విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. వీసా రద్దు చేసే క్రమంలో ఫెడరల్ ప్రభుత్వం సరైన రీతిలో వ్యవహరించడం లేదని వాదిస్తున్నారు.

**డిపోర్టేషన్ ముప్పు!**
వీసాలను రద్దు చేస్తూ ఫెడరల్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వందలాది విదేశీ విద్యార్థులకు నిర్బంధం, డిపోర్టేషన్ ముప్పు పొంచి ఉంది. హార్వర్డ్, స్టాన్ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్, ఒహాయో స్టేట్ యూనివర్సిటీ సహా కొన్ని చిన్న కాలేజీల విద్యార్థులు ఈ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. మొత్తంగా మార్చి చివరి వారం నుంచి ఇప్పటివరకు 160 కాలేజీల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. కనీసం 1024 మంది విద్యార్థుల వీసాలు రద్దు అయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఇదే సమయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ చర్యలకు వ్యతిరేకంగా కోర్టుల్లో దావాలు వేస్తున్న విద్యార్థులు.. తమ వీసా రద్దు చేయడానికి ప్రభుత్వం వద్ద ఎటువంటి సమర్థనీయ అంశాలు లేవని వాదిస్తున్నారు.

**ఎందుకు రద్దు చేస్తున్నారు?**
వీసా రద్దుకు అనేక కారణాలు చూపెడుతున్నప్పటికీ.. చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయని గుర్తించినట్లు కాలేజీలు పేర్కొంటున్నాయి. మరికొన్ని కేసుల్లో మాత్రం విద్యార్థులను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే విషయంపై స్పష్టత లేదు. ‘‘ఈ వీసాలను రద్దు చేస్తున్న సందర్భం, విధానం చూస్తుంటే.. దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో విద్యార్థి వీసాలను రద్దు చేసే విధానాన్ని డీహెచ్ఎస్ అవలంబిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది’’ అని మిషిగాన్ యూనివర్సిటీ తరపున వాదిస్తున్న లాయర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యూ హ్యాంప్‌షైర్‌లోని కాలేజీ విద్యార్థులు వేసిన దావాలోనూ ఇటువంటి అంశాలనే ప్రస్తావించారు. వీటిపై మాత్రం హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదని తెలుస్తోంది.

**వీసా రద్దైతే..?**
విద్యార్థి వీసా రద్దైతే.. ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించే ప్రమాదం ఉంది. అందుకే అరెస్టుకు భయపడిన కొందరు విద్యార్థులు చదువులు పూర్తి చేయకుండానే దేశం విడిచి వెళ్తున్నట్లు సమాచారం. ఇలా వీసా రద్దు, అరెస్టు చేయడం వంటి చర్యలు.. విదేశీ విద్యార్థులను అమెరికా చదువుల పట్ల నిరుత్సాహానికి గురిచేస్తాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏయే అంశాల ఆధారంగా వీటిని రద్దు చేస్తున్నారనే దానిపై క్లారిటీ లేకపోవడం విద్యార్థుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని చెబుతున్నారు.

మరోవైపు, విద్యార్థుల్లో భరోసా కల్పించేందుకు ప్రయత్నిస్తున్న కొన్ని కాలేజీలు.. వీసాల రద్దుకు సంబంధించి ఫెడరల్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొంటున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు మాత్రం విద్యార్థులకు ప్రయాణాల్లో జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నాయి. పాస్‌పోర్టులు, ఇమిగ్రేషన్ దస్త్రాలను తమవెంట ఉంచుకోవాలని చెబుతున్నాయి.



# రజాకార్ల గురించి ఇంకెన్నాళ్లు మాట్లాడతారు?: మహేశ్‌కుమార్ గౌడ్

**భాజపా నేతలు ఇంకెన్నాళ్లు రజాకార్ల గురించి మాట్లాడతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు.**

**ఈ కబురు,హైదరాబాద్:**
భాజపా నేతలు ఇంకెన్నాళ్లు రజాకార్ల గురించి మాట్లాడతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. వాళ్లు మతం గురించి తప్ప.. అభివృద్ధి గురించి ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ భాజపా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘‘భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఇస్తున్నారా? కులం, మతం పేరుతో రాజకీయాలు తప్ప.. భాజపాకి అభివృద్ధి పట్టదు. మతం పేరుతో చేసే రాజకీయాలకు కాలం చెల్లింది. మూసీ పునరుజ్జీవం విషయంలో భాజపాకి స్పష్టత లేదు. భాజపా నేతలకు రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలనే సోయి లేదు. మెట్రో విస్తీర్ణంలో హైదరాబాద్ రెండో స్థానం నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో రెండో దశకు కేంద్రం అనుమతి, నిధులు తీసుకురావాలనే ఆలోచన లేదు’’ అని మహేశ్‌గౌడ్ విమర్శించారు.

# అమిత్‌షా కలలు ఫలించవు: సీఎం స్టాలిన్

**అన్నాడీఎంకేతో కూటమి కుదుర్చుకుని రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కలలు ఫలించవని ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు.**



**మహిళకు ఇంటి పట్టా అందిస్తున్న సీఎం, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు**

**ఈ కబురు,పొన్నేరి :**
అన్నాడీఎంకేతో కూటమి కుదుర్చుకుని రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కలలు ఫలించవని ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీప అండార్‌కుప్పంలో 63 వేల మందికి ఇంటి పట్టాలు పంపిణీ, రూ.418 కోట్లతో నిర్మించిన భవనాల ప్రారంభోత్సవం, రూ.390 కోట్లతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన, దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు అందజేత కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి నాజర్ అధ్యక్షత వహించగా ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టాలిన్ మాట్లాడుతూ ఎడప్పాడి పళనిస్వామిని బెదిరించి కూటమి ఏర్పాటు చేసిన అమిత్‌షా గిమ్మిక్కులు తమిళనాట ఫలించవన్నారు. ఇక్కడ అన్నాదురై, పెరియార్, కరుణానిధిలాంటి ఆదర్శ వ్యక్తులు జన్మించడంతో ఇతరుల కుట్రలు, కుతంత్రాలు ఫలించవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు మతవాద శక్తులకు ఎప్పుడూ మద్దతివ్వరని, దీన్ని 2026 శాసనసభ ఎన్నికల్లో రుజువు చేయనున్నారని చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ప్రధాని మోదీ, అమిత్‌షా రాష్ట్ర ప్రజలను బానిసలుగా చేసేందుకు పన్నిన కుట్ర తాను ప్రాణాలతో ఉన్నంతవరకు ఫలించదని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తీరుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం చరిత్రాత్మక ఘటనగా అభివర్ణించారు. వక్ఫ్ సవరణ బిల్లులోనూ ఇదే తరహాలో తీర్పు వచ్చే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. తొలుత ముఖ్యమంత్రి పొన్నేరిలో రోడ్‌షో నిర్వహించారు. సుమారు 6 కి.మీ. మేర సాగిన రోడ్‌షోలో ప్రజలకు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఎంపీ శశికాంత్ సెంథిల్, ఎమ్మెల్యేలు దురైచంద్రశేఖర్, కృష్ణస్వామి, రాజేంద్రన్, గోవిందరాజన్, చంద్రన్, గణపతి, జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఆవడి మేయర్ ఉదయకుమార్ పాల్గొన్నారు.

# ధర పెరిగినా తగ్గేదేలే.. మార్చిలో 192% పెరిగిన పసిడి దిగుమతులు!

**బంగారం దిగుమతులు దేశంలో భారీగా పెరిగాయి. మార్చి నెలలో 192 శాతం మేర వృద్ధి నమోదైంది.**



దిల్లీ: ఓవైపు బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నా దీనిపై మోజు మాత్రం తగ్గడం లేదు. ఆ స్థాయిలో దేశంలో బంగారం దిగుమతులు పెరుగుతున్నాయి. తాజాగా మార్చి నెలకు సంబంధించిన గణాంకాలను వాణిజ్య మంత్రిత్వశాఖ విడుదల చేసింది. అంతకుముందు నెలతో పోలిస్తే దిగుమతుల విలువ 191.13 శాతం పెరిగి 4.47 బిలియన్ డాలర్లకు చేరినట్లు తెలిపింది. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.38 వేల కోట్లు అన్నమాట. దిగుమతులు భారీగా పెరగడంతో అదే స్థాయిలో ద్రవ్యలోటు పెరుగుతోంది.

202425 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి మార్చి మధ్య సుమారు 58 బిలియన్ డాలర్ల బంగారం దిగుమతి అయ్యింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం 45.54 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే 27.27 శాతం మేర ఈ పెరుగుదల నమోదైంది. ఈ స్థాయిలో దిగుమతులు పెరుగుదల బంగారంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, బ్యాంకుల నుంచి డిమాండ్, ధరల పెరుగుదల కారణంగా దిగుమతుల విలువ పెరుగుతోంది.

రూ. కోటి సంపాదించాలంటే..

ప్రస్తుతం 10 గ్రాముల మేలిమి పసిడి ధర దేశ రాజధాని దిల్లీలో రూ.98 వేలు పైనే పలుకుతోంది. ఇటీవల పెరుగుదలకు అమెరికా అధ్యక్షుడు అనుసరిస్తున్న వాణిజ్య విధానాలే కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు.

ఇక వెండి దిగుమతులు మాత్రం 85 శాతం మేర తగ్గి 119.3 మిలియన్ డాలర్లుగా నమోదైనట్లు వాణిజ్య మంత్రిత్వశాఖ తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.24 శాతం మేర తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

భారత్ దిగుమతి చేసుకుంటున్న బంగారంలో 40 శాతం వాటాతో స్విట్జర్లాండ్ అగ్రస్థానంలో ఉంది. యూఏఈ 16 శాతం, దక్షిణాఫ్రికా 10 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దేశంలోకి దిగుమతయ్యే మొత్తం దిగుమతుల్లో దీని వాటా 8 శాతం అని వాణిజ్య మంత్రిత్వశాఖ తెలిపింది. టన్నుల్లో చూసుకుంటే 202324 ఆర్థిక సంవత్సరంలో భారత్ 795.32 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకోగా 202425 ఆర్థిక సంవత్సరంలో 757.15 టన్నులకు తగ్గింది. ఫిబ్రవరి నెలలో 62 శాతం మేర తగ్గగా.. అంతకుముందు జనవరిలో 40.8 శాతం, 2024 డిసెంబర్‌లో 55.39 శాతం మేర దిగుమతులు పెరగడం గమనార్హం. ప్రస్తుతం చైనా తర్వాత రెండో అతిపెద్ద దిగుమతిదారుగా భారత్ ఉంది. ముఖ్యంగా జువెలరీ ఇండస్ట్రీ నుంచి డిమాండ్ కొనసాగుతోంది




# మూడు బ్యాంకులపై ఆర్‌బీఐ కొరడా: భారీ జరిమానా..




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా .. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ & పంజాబ్ నేషనల్ బ్యాంకులకు జరిమానా విధించింది. వినియోగదారులకు అందించే సేవలలో లోపం, నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆర్‌బీఐ ఈ జరిమానా విధించినట్లు తెలుస్తోంది.

కోటక్ మహీంద్రా బ్యాంక్: లోన్ సిస్టమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను పాటించకపోవడం, ఇతర చట్టబద్ధమైన పరిమితులకు సంబంధించిన ఉల్లంఘనల కారణంగా ఆర్‌బీఐ.. కోటక్ మహీంద్రా బ్యాంకుకు రూ. 61.4 లక్షల జరిమానా విధించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్: కేవైసీ నిబంధనలను పాటించకపోవడం వల్ల ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు.. ఆర్‌బీఐ రూ. 38.6 లక్షల జరిమానా విధించింది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్: కస్టమర్ సర్వీస్ నిబంధనలను పాటించడంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా విఫలమైంది. ఈ కారణంగా ఆర్‌బీఐ రూ. 29.6 లక్షల జరిమానా విధించింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. బ్యాంకులకు జరిమానాలు విధించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా చాలా బ్యాంకులకు భారీ మొత్తంలో జరిమానాలు విధించింది. నియమాలను అనుసరించడంలో.. బ్యాంకులు విఫలమైతే ఆర్‌బీఐ జరిమానా విధించడానికి సిద్ధంగా ఉంటుంది.

# ఈపీఎఫ్ఓ 3.0 వచ్చేస్తోంది.. కీలక వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి

**ఈపీఎఫ్ఓలో చాలా వరకు మార్పులు చోటుచేసుకోబోతున్నాయని మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు.**




దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ లో డిజిటల్‌గా కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈపీఎఫ్ఓ 3.0తో 9 కోట్ల మంది చందాదారులకు ప్రయోజనం చేకూరనుందని వివరించారు. మే లేదా జూన్‌కల్లా కొత్త వెర్షన్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ 'పీటీఐ'కిచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు పంచుకున్నారు.

ఈపీఎఫ్ఓ వెర్షన్ 3.0తో సేవలు మరింత సులభతరం కానున్నాయనని చెప్పారు. ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు, డిజిటల్ కరెక్షన్లు, ఏటీఎం ద్వారా విత్‌డ్రా వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈపీఎఫ్ఓను మరింత సౌకర్యంగా, సమర్థంగా తీర్చిదిద్దడమే ఈ మార్పుల వెనుక ముఖ్య ఉద్దేశమని వివరించారు.

ఇన్ఫోసిస్ నారాయణమూర్తి మనవడికి రూ.3.3 కోట్ల డివిడెండ్

క్లెయిమ్‌లు, కరెక్షన్ల కోసం ఫారాలు నింపడం, కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందులు ఈ కొత్త వెర్షన్‌తో తొలగబోతున్నాయని మాండవీయ తెలిపారు. వేగవంతమైన సెటిల్‌మెంట్ల వల్ల డబ్బులు వారి వారి బ్యాంక్ ఖాతాల్లో త్వరగా జమ అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 27 లక్షల కోట్ల విలువైన నగదు నిల్వలను ఈపీఎఫ్ఓ కలిగి ఉందని, ఈ మొత్తానికి ప్రభుత్వ హామీతో పాటు 8.25 శాతం వడ్డీని అందిస్తోందని చెప్పారు.

సెంట్రలైజ్డ్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ వల్ల ఇప్పటికే దేశంలోని ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్ పొందే వెసులుబాటు కల్పించామని, దీనివల్ల 78 లక్షల మందికి ప్రయోజనం కలుగుతోందని వివరించారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన, శ్రామిక్ జన్‌ధన్ యోజన వంటి పెన్షన్ పథకాలన్నింటినీ ఏకీకృతం చేసి పెన్షన్ కవరేజీని క్రమబద్ధీకరించడం, బలోపేతం చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందన్నారు.

# అమెరికా ఉద్యోగులపై వివక్ష ఆరోపణలు.. ఖండించిన టీసీఎస్

**యూఎస్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న టీసీఎస్ అమెరికా ఉద్యోగులపై వివక్ష చూపిస్తోందని దక్షిణాసియా యేతర మాజీ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు**




ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. అమెరికా ఉద్యోగులపై ఐటీ దిగ్గజం వివక్ష చూపిస్తోందని దక్షిణాసియా యేతర మాజీ ఉద్యోగులు విమర్శిస్తున్నారు. దీనిపై అమెరికాలో సమాన ఉపాధి అవకాశాల కమిషన్ దర్యాప్తు చేపట్టింది. ఈ విషయాన్ని బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది.

ప్రధానంగా 40 ఏళ్లు పైబడిన దక్షిణాసియా యేతర మాజీ ఉద్యోగులు టీసీఎస్ తీరుపై పక్షపాత లే ఆఫ్‌లు అమలుచేస్తోందని ఆరోపణలు చేశారు. హెచ్1 బీ వీసా కలిగిన భారతీయ ఉద్యోగులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. ఈ ఆరోపణల్ని టీసీఎస్ ఖండించింది. ఈ మాటల్లో వాస్తవం లేదని కేవలం తప్పుదారి పట్టించడానికి చేస్తున్న ప్రయత్నమని స్పష్టం చేసింది. తాము అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపింది.

**రూ. కోటి సంపాదించాలంటే..**

ఇదేతరహా ఆరోపణలు గతంలో బ్రిటన్‌లోని ఓ ఉపాధి ట్రైబ్యునల్‌లోనూ వెలుగులోకి వచ్చాయి. అక్కడ ముగ్గురు టీసీఎస్ ఉద్యోగులు వయసు, జాతీయత ఆధారంగా వివక్షకు గురైనట్లు ఆరోపించారని ది గార్డియన్ నివేదించింది. ఇదిలాఉండగా.. ఇప్పటికే ఫలితాలను ప్రకటించిన టీసీఎస్.. అమెరికా కార్యకలాపాల నుంచి వచ్చే ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 5.3 శాతం పెరిగి రూ.64,479 కోట్లకు చేరిందని పేర్కొంది. నాలుగో త్రైమాసికంలో ఉద్యోగుల తొలగింపు రేటు 13 శాతం నుంచి 13.3 శాతం పెరిగిందని తెలిపింది. అమెరికా టారిఫ్‌ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన అనిశ్చితి మధ్య 6.07 లక్షల మంది ఉద్యోగులకు వేతన పెంపును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ.. ఆ వార్తలను కొట్టిపారేసిన కేంద్రం




**యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించబోతున్నారంటూ వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది.**

యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించబోతున్నారంటూ వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది. రూ.2000 పైబడి జరిపే లావాదేవీలపై జీఎస్టీ వేసేందుకు కేంద్రం సిద్ధమవుతోందంటూ వచ్చిన వార్తలు పూర్తి అవాస్తవం అని పేర్కొంది. ఈ మేరకు ఆర్థికమంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. యూపీఐ చెల్లింపులపై జీఎస్టీ అంటూ ఈ ఉదయం నుంచి కొన్ని వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా ప్రచారం జోరుగా సాగుతున్న వేళ దీనిపై స్పందించింది.

"రూ.2 వేలు విలువ దాటిన లావాదేవీలపై జీఎస్టీ విధించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందంటూ కొన్ని మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. అవన్నీ పూర్తి అవాస్తవం. తప్పుదోవ పట్టించేవి. వాటికి ఎలాంటి ఆధారం లేదు. ప్రభుత్వం ముందు అలాంటి అంశం ఏదీ పరిశీలనలో లేదు'' అని కేంద్రం స్పష్టతనిచ్చింది. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను మరింత ప్రమోట్ చేయడం తమ ముఖ్య ఉద్దేశమని వివరించింది.




# 2025 టీవీఎస్ అపాచీ ఆర్ఆర్ 310 వచ్చేసింది: ధర ఎంతో తెలుసా?




టీవీఎస్ కంపెనీ.. 2025 అపాచీ ఆర్ఆర్ 310 బైకును మార్కెట్లో లాంచ్ చేసింది. దీని ధర రూ. 2.77 లక్షలు (ఎక్స్-షోరూమ్). ఇది దాని మునుపటి మోడల్ కంటే కూడా ఎక్కువ ఫీచర్స్ పొందుతుంది. కంపెనీ ఈ బైక్ కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. డెలివరీలు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

2025 అపాచీ ఆర్ఆర్ 310.. టర్న్ సిగ్నల్ లాంప్స్, డ్రాగ్ టార్క్ కంట్రోల్ అనే రెండు సెగ్మెంట్ ఫస్ట్ ఫీచర్లను పొందుతుంది. లాంచ్ కంట్రోల్, కొత్త 8 స్పోక్ అల్లాయ్ వీల్స్ వంటివి కూడా ఈ బైకులో ఉన్నాయి. టీవీఎస్ ఆసియా ఓఎంసీ రేస్ బైక్ నుంచి ప్రేరణ పొందటం చేత.. ఈ బైక్ సెపాంగ్ బ్లూ రేస్ రెప్లికా కలర్ స్కీమ్ పొందుతుంది.

కొత్త అపాచీ ఆర్ఆర్ 310 బైక్ అదే 312 సీసీ సింగిల్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ద్వారా.. 9,800 rpm వద్ద 37 bhp & 7,900 rpm వద్ద 29 Nm టార్క్ అందిస్తుంది. ఈ ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది. ఇందులో ట్రాక్, స్పోర్ట్, అర్బన్, రెయిన్ అనే నాలుగు రైడింగ్ మోడ్స్ ఉన్నాయి. ఈ బైక్ కోసం కంపెనీ ప్రత్యేకంగా కిట్ కూడా అందిస్తోంది. దీనికి అదనంగా డబ్బు చెల్లించాల్సి ఉంటుంది.

# 'నా జీవితంలో అప్స్ మాత్రమే ఉంటాయి'.. దేవీశ్రీ ప్రసాద్ ఆసక్తికర కామెంట్స్!



'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీ రివ్యూ.. తల్లీకొడుకుల సెంటిమెంట్ పనిచేసిందా..?

టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ దేవీశ్రీ ప్రసాద్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. అందరి జీవితాల్లో అప్స్ అండ్ డౌన్స్ ఉంటాయని.. కానీ నా లైఫ్‌లో కేవలం అప్స్ మాత్రమే ఉంటాయన్నారు. నాకు ఎవరైనా చెడు చేస్తే వారు చిన్న పిల్లలుగా కనిపిస్తారని అన్నారు. దేవుడిపై భారం వేసి జీవితంలో సక్సెస్ అవుతుంటానని వెల్లడించారు. గచ్చిబౌలి స్టేడియంలో స్టేజ్ ఏర్పాటు చేశామని.. ర్యాంప్ కూడా వేశామని తెలిపారు. నా ప్రతి షో ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పుడు జరగబోయే స్పోర్ట్స్ స్టేడియం కూడా అద్భుతంగా ఉందని దేవీశ్రీ ప్రసాద్ అన్నారు.

ఇటీవల కర్ణాటక లో చేసిన షో సక్సెస్ అయిందని దేవీశ్రీ ప్రసాద్ తెలిపారు. నా మ్యూజికల్ షోకు చాలామంది అతిరథ మహారథులు చెప్పారు. రంగ స్థలం, సరిలేరు నీకెవ్వరు వంటి పలు సినిమాలు విశాఖలో చేశామని గుర్తు చేశారు. అందరు నాపై చూపించే ప్రేమనే నాకు ఎనర్జీ అని అన్నారు. పలు విదేశాల్లో తాను షోలు చేశానని డీఎస్పీ వెల్లడించారు. ఇటీవల మ్యూజికల్ నైట్‌కు వైజాగ్ పోలీసులు అనుమతి నిరాకరించడంతో దేవీశ్రీ ప్రసాద్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

**వైజాగ్‌లో అనుమతి నిరాకరణ**

టాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ వైజాగ్‌లో నిర్వహించబోయే మ్యూజికల్ నైట్‌కు అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. నాలుగు సార్లు ప్రయత్నించినా విశాఖ పోలీసులు అనుమతులు ఇచ్చేందుకు ఒప్పుకోలేదు. ఏప్రిల్ 19న విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యూజికల్ నైట్ నిర్వహించేందుకు డీఎస్పీ సిద్ధమయ్యారు. ఇప్పటికే ఈ లైవ్ షో కోసం ఆన్‌లైన్‌లో భారీగా టికెట్లు విక్రయించారు. కానీ భద్రతా కారణాల రీత్యా అనుమతి ఇవ్వలేమని సీపీ శంఖబ్రత బాగ్చీ తేల్చి చెప్పారు. కొద్ది రోజుల క్రితం ఆక్వా వరల్డ్‌లో జరిగిన దుర్ఘటన నేపథ్యంలోనే అనుమతులకు నిరాకరించారు.

**ఎవరెలా చేశారంటే..**

అర్జున్‌గా కల్యాణ్ రామ్ మంచి నటనను కనబరిచాడు. వైజయంతిగా విజయశాంతి దుమ్మురేపింది. ఇద్దరూ భావోద్వేగ, యాక్షన్ సన్నివేశాలలో ఎంతమాత్రం నిరాశపరచలేదు. ఈ వయసులోనూ విజయశాంతి డూప్ లేకుండా స్వయంగా యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడం అందరినీ ఆశ్చర్యం కలిగించేలా ఉంటాయి. శక్తిమంతమైన తల్లి పాత్రలో ఆమె వంద శాతం న్యాయం చేసింది. పోలీస్ ఆఫీసర్‌గా ఆమె మరికొంత సమయం పాటు స్క్రీన్ మీద కనిపించి ఉండుండే బాగుండని అభిమానులకు కలుగుతుంది. అర్జున్ భార్య చిత్ర పాత్రలో సాయి మంజ్రేకర్ పరిధిమేరకు మాత్రమే ఉంటుంది. పఠాన్ పాత్రలో సోహైల్ ఖాన్ పాత్ర చిత్రీకరణ చాలా పేలవంగా ఉంటుంది. విలన్‌గా భారీ ఎలివేషన్స్‌కు మాత్రమే ఆయన పాత్ర ఉంటుంది. శ్రీకాంత్ కమిషనర్‌గా చాలా బాగా చేశాడు. తనకు ఇచ్చిన పాత్రలో సమర్థవంతంగా నటించాడు. హీరోకు ఎప్పుడు వెన్నంటి ఉండే మిత్రులలో ఒకరిగా పృథ్వీ తప్పకుండా ప్రేక్షకులను మెప్పిస్తాడు. ఈ సినిమా ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెడుతుంది. బడ్జెట్ మేరకు నిర్మాణ విలువలు పర్వాలేదు. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి మాస్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించడంలో మెప్పించాడు. యన్స్‌కు మాత్రం చివరి 30 నిమిషాలు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

## మహేశ్‌బాబుతో ప్రియాంక.. నిక్ జోనస్‌తో నమ్రత, సితార..



సూపర్ స్టార్ మహేశ్‌బాబు కుటుంబం ఇటీవలే ఇటలీ టూర్‌కు వెళ్లింది. అక్కడ ప్రియాంక చోప్రా భర్త, సింగర్, నటుడు నిక్ జోనస్ .. 'ద లాస్ట్ ఫైవ్ ఇయర్స్' షోకు నమ్రత హాజరైంది. కూతురు సితార, తనయుడు గౌతమ్‌తో కలిసి ఆ షోను ఎంజాయ్ చేసింది. అందుకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ద లాస్ట్ ఫైవ్ ఇయర్స్ నాటకంలో నిక్ జోనస్ నటన అద్భుతంగా ఉందని కొనియాడింది. ఈ షోకు ప్రత్యేకంగా ఆహ్వానించినందుకు ప్రియాంకచోప్రాకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ పోస్ట్‌పై ప్రియాంక స్పందిస్తూ.. మీ సమయం సంతోషకరంగా సాగినందుకు సంతోషం అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో రాసుకొచ్చింది. ఇకపోతే మహేశ్ బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ ఇటీవలే ఒడిశాలో పూర్తయింది. త్వరలోనే రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఇక్కడ మహేశ్‌బాబు ప్రియాంక చోప్రా జంటగా సినిమా చేస్తుంటే.. అక్కడ ప్రియాంక భర్త నటించిన షోను మహేశ్ ఫ్యామిలీ చూసి ఎంజాయ్ చేసిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.


## రామాయణ 2 కోసం....



**కథానాయకుడు యశ్ నిర్మిస్తున్న బహుభాషా చిత్రాల్లో 'టాక్సిక్'తో పాటు 'రామాయణ' ఉన్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది.**

కథానాయకుడు యశ్ నిర్మిస్తున్న బహుభాషా చిత్రాల్లో 'టాక్సిక్'తో పాటు 'రామాయణ' ఉన్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తుండగా.. రావణుడి పాత్రను యశ్ పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా తొలి భాగం చిత్రీకరణ ముగింపు దశకు చేరుకోగా.. ఇప్పుడు రెండో భాగానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. మే నెలాఖరు నుంచి 'రామాయణ: పార్ట్ 2' చిత్రీకరణ మొదలు కానుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో తొలుత సీత పాత్రకు సంబంధించి అశోక వనం ఎపిసోడ్స్ చిత్రీకరించనున్నారని.. జూన్ నుంచి రణ్‌బీర్‌పై రాముడి పాత్రకు సంబంధించిన సన్నివేశాలు తెరకెక్కిస్తారని తెలిసింది. అలాగే వీళ్లిద్దరిపై రెండు పాటల్ని కూడా చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్ర తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి రానుండగా.. రెండో భాగం 2027 దీపావళికి విడుదల కానుంది.

## నో ఎంట్రీ సీక్వెల్లో కనిపించనున్న తమన్నా!



**బాలీవుడ్ 'నో ఎంట్రీ' సీక్వెల్‌లో తమన్నాకు ఎంట్రీ లభించిందని సమాచారం. వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, దిల్జీత్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటించనున్న హిందీ చిత్రం 'నో ఎంట్రీ 2'. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం అనిల్ కపూర్, సల్మాన్ ఖాన్, ఫర్దీన్ ఖాన్, బిపాసా బసు, ఈషా డియోల్ ప్రధాన పాత్రధారులుగా అనీస్ బాజ్మీ దర్శకత్వంలో బోనీ కపూర్ నిర్మించిన హిందీ బడ్డీ రొమాంటిక్ కామెడీ మూవీ 'నో ఎంట్రీ'. కాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా 'నో ఎంట్రీ 2' సినిమా తీస్తున్నారు అనీస్ బాజ్మీ, బోనీ కపూర్.**

**నలుగురికి పైగా హీరోయిన్లు..**

**ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రంలో నలుగురు కథానాయికలకు పైగా నటిస్తారని టాక్. వీరిలో ఇప్పటికి తమన్నా, అదితీ రావ్ హైదరీలను సంప్రదించారని, కథ నచ్చడంతో ఈ కథానాయికలు ఈ సినిమా చేసేందుకు ఒప్పుకున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఏడాదే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించి, వీలైతే ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని బీటౌన్ టాక్. ఈ విషయాలపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది.**



## 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీ రివ్యూ.. తల్లీకొడుకుల సెంటిమెంట్ పనిచేసిందా..?



**టైటిల్ : అర్జున్ సన్నాఫ్ వైజయంతి**

నటీనటులు: నందమూరి కల్యాణ్‌రామ్, విజయశాంతి, సయీ మంజ్రేకర్,పృథ్వీ, సోహైల్ ఖాన్, శ్రీకాంత్ తదితరులు
నిర్మాణ సంస్థలు: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్
నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు
ఎడిటింగ్: తమ్మిరాజు
దర్శకత్వం, కథ: ప్రదీప్ చిలుకూరి
స్క్రీన్‌ప్లే: శ్రీకాంత్ విస్సా
సంగీతం: అజనీష్ లోక్‌నాథ్
సినిమాటోగ్రఫీ: రామ్ ప్రసాద్
విడుదల: ఏప్రిల్ 18, 2025

విజయశాంతి , నందమూరి కల్యాణ్‌రామ్ తల్లీ కుమారులుగా నటించిన సినిమా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' తాజాగా థియేటర్స్‌లోకి వచ్చేసింది. నూతన దర్శకుడు ప్రదీప్ చిలుకూరి ఈ మాస్ చిత్రంతో డైరెక్టర్‌గా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్, సునీల్ నిర్మించారు. అమ్మ కోసం మనం ఎన్ని త్యాగాలైనా చేయొచ్చు అని చెప్పే అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రం ఎలా ఉంది..? ప్రీ రిలీజ్ వేడుక సమయంలో ఎన్టీఆర్ చెప్పినట్లుగా ఈ మూవీ కళ్యాణ్ కెరీర్‌లో ఒక స్పెషల్‌గా మిగిలుతుందా..? ఈ రివ్యూలో తెలుసుకుందాం.

**కథేంటి..?**

'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' కథ చాలా సినిమాల మాదిరే రొటిన్ స్టోరీ.. ఇందులో తల్లీకొడుకుల మధ్య బలమైన ఎమోషన్ కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో వైజయంతి (విజయశాంతి) డ్యూటీలో భాగంగా ఎన్‌కౌంటర్ చేస్తూ తెరపైకి ఎంట్రీ ఇస్తుంది. వైజయంతి ఒక కఠినమైన, నిజాయితీతో కూడిన పోలీసు అధికారిణిగా ఉంటుంది. తన కుమారుడు అర్జున్ (కల్యాణ్‌రామ్) కూడా నిజాయితీగల IPS ఆఫీసర్ కావాలని, తన అడుగుజాడల్లో నడుస్తాడని ఆశిస్తుంది. అయితే, ఒక మాఫియా డాన్‌తో ఊహించని ఎదురుదెబ్బ అర్జున్‌ను మరో దారిలో నడిచేలా చేస్తుంది. ఉద్దేశపూర్వకంగా అర్జున్ నేరస్థుడు కాకపోయినా, ప్రజలను రక్షించడానికి స్థానిక మాఫియాను ఎదుర్కొనే ఆయుధంగా అర్జున్ మారతాడు.
అర్జున్ చేస్తున్న మంచిపనిని చూసిన పృథ్వి తన పోలీస్ ఉద్యోగాన్ని పక్కనపెట్టి అతనితో పాటుగా అడుగులేస్తాడు. అలా వారిద్దరూ ఒక పెద్ద గ్యాంగ్‌నే ఏర్పాటు చేస్తారు. ఏకంగా పోలీస్ వ్యవస్థనే సవాల్ చేసేంతలా అర్జున్ గ్యాంగ్ బలోపేతం అవుతుంది. ఇవన్నీ అర్జున్‌కు తన తల్లితో విభేదాలకు దారితీస్తాయి.. దీంతో అర్జున్ వెళ్తున్న దారి ఎంతమాత్రం కరెక్ట్ కాదంటూ ఆమె హెచ్చరిస్తూనే ఉంటుంది. ఏకంగా అర్జున్‌ను ఇంటి నుంచి బయటకు పంపేసి ఒంటరిగానే ఉంటుంది. అర్జున్ తరువాత విశాఖలోని ఒక కాలనీకి వెళ్లి అక్కడే ఉంటూ నగరంలోనే టాప్ గ్యాంగ్‌స్టర్‌గా ఎదుగుతాడు.
పేదలజోలికి వచ్చిన వారందరిని వేటాడుతూ ముందుకు వెళ్తుంటాడు. ఐపీఎస్‌కు సెలక్ట్ అయిన అర్జున్ ప్రజల కోసం కత్తి ఎందుకు పట్టాడు..? ఉద్యోగ రిత్యా ఎన్నో ఎన్‌కౌంటర్లు చేసిన వైజయంతిని నేరస్థుల నుంచి అర్జున్ ఎలా కాపాడుకుంటాడు. డ్రగ్స్ మాఫీయా అర్జున్ తండ్రిని ఎందుకు చంపుతుంది..? చివరకు తన ప్రాణాలను కాపాడిన కొడుకునే వైజయంతి ఎందుకు జైలుకు పంపుతుంది..? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

**ఎలా ఉందంటే..**

ఈ సినిమా కథ చాలా పాత కథే.. ఇప్పటికే ఈ కాన్సెప్ట్‌తో చాలా సినిమాలు వచ్చాయి. అయితే, ఈ సినిమాకు ప్రధాన బలం విజయశాంతి అని చెప్పవచ్చు. ఒక శక్తిమంతమైన తల్లి పాత్రలో ఆమె దుమ్మురేపారు. తల్లి ఎంత స్థాయిలో ఉన్నా తన బిడ్డ భవిష్యత్ చాలా ముఖ్యం అని ఇందులో చక్కగా చూపించారు. కథలో భాగంగా వైజాక్ కమీషనర్‌గా శ్రీకాంత్ రావడంతో కథలో స్పీడ్ అందుకుంటుంది. గతంలో వైజయంతి టీమ్‌లో అతను పనిచేసిన అనుభవం ఉండటం వల్ల ఆ కుటుంబంతో దగ్గరి సాన్నిహిత్యం ఉంటుంది. ఒక సిన్సియర్ ఆఫీసర్ కుమారుడు గ్యాంగ్‌స్టర్ అవడం ఏంటి..? అని అర్జున్ గతం తెలుసుకుంటాడు. కానీ, ఆ సీన్లు ఏవీ పెద్దగా వర్కౌట్ కాలేదు.
'అర్జున్ సన్నాఫ్ వైజయంతి ' సినిమా కథ పాతదే అయినా సరే అభిమానులను మాత్రం ఆకట్టుకునే విధంగానే ఉంటుంది. దర్శకుడు కూడా మాస్‌తో పాటు భారీ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించడంలో ప్రేక్షకులను మెప్పిస్తాడు. ఫస్టాఫ్ కొంతమేరకు ఫర్వాలేదనిపిస్తుంది. అయితే, రెండవ భాగంలోకి కథ వెళ్ళే కొద్దీ పాత తరహా కథనే చూపిస్తున్నాడని అభిప్రాయం అందరిలో కలుగుతుంది. మాస్ యాక్షన్ బ్లాక్‌లు బాగానే టేకింగ్ చేసిన దర్శకుడు ప్రదీప్ చిలుకూరి కథ చెప్పడంలో చాలా వరకు తడబడ్డాడని చెప్పవచ్చు. సులువుగా ఉన్న కథను కొత్తగా చెప్పే క్రమంలో స్క్రీన్‌ప్లే దెబ్బతిందని అర్థం అవుతుంది. అజనీష్ లోక్‌నాథ్ నేపథ్య సంగీతం బాగుంది. క్లైమాక్స్‌లో ఆయన ఇచ్చిన బీజీఎమ్ పీక్స్‌లో ఉంటుంది. కానీ, పాటల విషయంలో పెద్దగా మ్యూజిక్ ప్రభావం లేదు.

ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే సీన్లకు కల్యాణ్‌రామ్ అభిమానులు పండుగ చేసుకుంటారు. ఆ సమయంలో థియేటర్స్ దద్దరిల్లడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. క్లాస్ ప్రేక్షకులకు పెద్దగా నచ్చకపోయినప్పటికీ మాస్ ఆడియన్స్‌ను మాత్రం మెప్పిస్తుంది. కంటెంట్ ఆధారంగా సినిమా చూసే వారికి ఈ చిత్రం పెద్దగా నచ్చకపోవచ్చు. సినిమా క్లైమాక్స్‌లో విజయశాంతి, కల్యాణ్‌రామ్ పోటీ పడి నటించారు. క్లైమాక్స్ కంటతడి పెట్టించేలా ఉంటుంది. కథ విషాదాంతం కాకపోయినప్పటికీ పతాక ఘట్టాల్లో ఎమోషన్స్ ఆ స్థాయిలో ఉంటాయి. ఆ భావోద్వేగాలే ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కల్యాణ్‌రామ్ బలం ఎమోషన్.. దాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా పండించారు. అందుకే సినిమా క్లైమాక్స్ బాగా హిట్ అయింది. ఆఖర్లో సుమార 30 నిమిషాలు అన్ని వర్గాల ప్రేక్షకులను 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి ' కట్టిపడేస్తుంది.

## 'ఊర్వశి రౌతేలా నోటి దూల.. మండిపడుతున్న స్థానికులు'



బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలా టాలీవుడ్‌లోనూ ఫుల్ ఫేమస్ అయింది. డాకు మహారాజ్ తర్వాతా మరింత క్రేజ్ దక్కించుకుంది. ఇటీవల రిలీజైన సన్నీ డియోల్ మూవీ జాట్‌లో ఓ ఐటమ్ సాంగ్‌లో మెరిసింది. ఎప్పుడు వార్తల్లో నిలిచి ఈ ముద్దుగుమ్మ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ సారి ఏకంగా తనకు గుడి కట్టారంటూ కామెంట్స్ చేసింది. ఉత్తరాఖండ్‌లో నాకు ఓ గుడి కట్టారు. బద్రీనాథ్‌కు దగ్గరే ఊర్వశి దేవాలయం ఉంది. జనాలు అక్కడికి వెళ్లి నా ఆశీర్వాదం తీసుకుంటారు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు నన్ను భక్తిగా పూజ చేసి నా ఫోటోకు దండలు కూడా వేస్తారని చెప్పుకొచ్చింది. నన్ను ఆ గుడిలో దండమామై అని పిలుస్తుంటారని కూడా తెలిపింది. బద్రీనాథ్‌కు ఎవరైనా వెళ్తే పక్కనే ఉన్న నా ఆలయాన్ని సందర్శించండి అంటూ సలహా కూడా ఇచ్చింది. తాజాగా ఆమె వ్యాఖ్యలపై స్థానికి పూజారులు స్పందించారు. ఊర్వశి రౌతేలా చేసిన కామెంట్స్‌పై మండిపడుతున్నారు. ఊర్వశి రౌతేలా వాదన అందరినీ తప్పుదారి పట్టించేలా ఉందని పూజారి భువన్ చంద్ర ఉనియాల్ అన్నారు. బద్రినాథ్ సమీపంలోని బామ్నిలో ఊర్వశీ పేరుతో ఆలయం ఉన్న మాట వాస్తవమేనని.. కానీ ఆలయంతో ఆమెకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆమె వ్యాఖ్యలతో స్థానిక పూజారులు, మత అధికారులు, బద్రీనాథ్ నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఆమె గుడి కాదు. ఇలాంటి ప్రకటనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఊర్వశీ వ్యాఖ్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అర్చకులు డిమాండ్ చేస్తున్నారు. ఇది మత విశ్వాసాలను అగౌరవపరచడమే అని బ్రహ్మకపాల్ తీర్థ్ పురోహిత్ సొసైటీ అధ్యక్షుడు అమిత్ మండిపడ్డారు.
బద్రీనాథ్ ధామ్ సమీపంలోని బామ్నిలో ఉన్న ఊర్వశి ఆలయం.. పురాణాల ప్రకారం సతీదేవి శరీరం భాగాలు పడిపోయిన ప్రదేశం నుంచి ఉద్భవించిందని విశ్వసిస్తున్నారు. ఈ పవిత్రమైన ఆలయాన్ని ఊర్వశి దేవికి అంకితం చేశారని చెబుతున్నారు. ఊర్వశి దేవాలయం హిందూ పురాణాలలో సతీదేవితో ముడిపడి ఉందని అంటున్నారు. ఈ ఆలయం 108 శక్తిపీఠాలలో భాగంగా పరిగణించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. వారి సంప్రదాయంలో భాగంగా పూజించే బామ్ని, పాండుకేశ్వర్ గ్రామాల నివాసితుల ఆధ్యాత్మిక ఆలయంగా అనుసంధానించబడి ఉందని ఆయన తెలిపారు. బ్రహ్మకపాల్ తీర్థ పురోహిత్ సొసైటీ అధ్యక్షుడు అమిత్ సతీ కూడా రౌతేలా వ్యాఖ్యలను ఖండించారు. ఈ ఆలయం పురాతనమైనదని.. ఊర్వశి దేవితో ముడిపడి ఉందని.. ఏ వ్యక్తితోనూ కాదని తెలిపారు. ఇలాంటి ప్రకటనలు ఇక్కడి ప్రజల మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన అన్నారు. ఊర్వశి రౌతేలాపై స్థానికులైన బామ్ని, పాండుకేశ్వర్ గ్రామస్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో పంజాబ్ గెలుపు



**సొంతగడ్డపై వరుసగా రెండు ఓటముల నేపథ్యంలో.. ఈసారైనా తమ జట్టు గెలుపు రుచి చూస్తుందేమో అని శుక్రవారం ఆశగా చిన్నస్వామి స్టేడియానికి వచ్చారు ఆర్సీబీ అభిమానులు. కానీ వరుణుడు ముంచెత్తడంతో వారిలో నిరాశ! వర్షం ఆగిపోవాలని, మ్యాచ్ జరగాలని ఎంతగానో కోరుకున్నారో!**

**సొంతగడ్డపై ఆర్సీబీకి మూడో ఓటమి**

**స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో పంజాబ్ గెలుపు**

**బెంగళూరు ఓటమి**

సొంతగడ్డపై వరుసగా రెండు ఓటముల నేపథ్యంలో.. ఈసారైనా తమ జట్టు గెలుపు రుచి చూస్తుందేమో అని శుక్రవారం ఆశగా చిన్నస్వామి స్టేడియానికి వచ్చారు ఆర్సీబీ అభిమానులు. కానీ వరుణుడు ముంచెత్తడంతో వారిలో నిరాశ! వర్షం ఆగిపోవాలని, మ్యాచ్ జరగాలని ఎంతగానో కోరుకున్నారో! వారి కోరిక ఫలించి, వర్షం ఆగింది. మ్యాచ్ మొదలైంది. కానీ కాసేపటి తర్వాత ఆర్సీబీ అభిమానులు.. మళ్లీ వర్షం వచ్చి మ్యాచ్ ఆగిపోతే బావుండని అనుకుని ఉంటటారేమో! వాన వల్ల నెమ్మదించిన పిచ్‌పై ఆ జట్టు బ్యాటర్లు అంతగా తడబడ్డారు మరి! ఒక దశలో 42/7తో నిలిచి, అతి కష్టం మీద 96 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన బెంగళూరు.. బంతితో పోరాడినప్పటికీ సొంతగడ్డపై హ్యాట్రిక్ ఓటమిని తప్పించుకోలేకపోయింది.

ఐపీఎల్ 18లో బయటి వేదికల్లో విజయాల మీద విజయాలు సాధిస్తున్న బెంగళూరు.. సొంతగడ్డపై మాత్రం తేలిపోతోంది. చిన్నస్వామి స్టేడియంలో ఆ జట్టు వరుసగా మూడో ఓటమి రుచి చూసింది. వర్షం వల్ల 14 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. యుజ్వేంద్ర చాహల్ (2/11), మార్కో యాన్సెన్ (2/10), అర్ష్‌దీప్ సింగ్ (2/23), హర్‌ప్రీత్ బ్రార్ (2/25) విజృంభించడంతో మొదట బెంగళూరు 9 వికెట్లకు 95 పరుగులే చేసింది. టిమ్ డేవిడ్ (50 నాటౌట్; 26 బంతుల్లో 5×4, 3×6) మెరుపుల్లేకుంటే బెంగళూరు పరిస్థితి ఘోరంగా ఉండేదే. అనంతరం హేజిల్‌వుడ్ (3/14), భువనేశ్వర్ (2/26) సత్తా చాటడంతో ఛేదనలో పంజాబ్ కూడా కష్టపడింది. అయితే నేహాల్ వధేరా (33 నాటౌట్; 19 బంతుల్లో 3×4, 3×6) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు.

తేలికే అనుకుంటే..: చిన్న లక్ష్యమే కదా.. పంజాబ్ విధ్వంసక ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్ ఆర్యలే పని పూర్తి చేసేస్తారనుకుంటే.. ఛేదన అంత తేలిగ్గా సాగలేదు. వీళ్లిద్దరూ ఇన్నింగ్స్‌లను మెరుగ్గానే ఆరంభించినప్పటికీ పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. ఇలా షాట్లకు దిగారో లేదో అలా ఔటైపోయారు. ప్రభ్‌సిమ్రన్ (13)ను భువనేశ్వర్, ప్రియాంశ్ (16)ను హేజిల్‌వుడ్ పెవిలియన్ చేర్చారు. శ్రేయస్ అయ్యర్ (7), ఇంగ్లిస్ (14)లను సైతం హేజిల్‌వుడ్ ఎక్కువసేపు నిలవనీయలేదు. 8 ఓవర్లకు పంజాబ్ 53/4కు చేరుకుంది. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై 6 ఓవర్లలో 43 పరుగులు చేయాల్సి రావడంతో ఆర్సీబీలో ఆశలు చిగురించాయి. కానీ ఆరంభంలో కొంత ఇబ్బంది పడ్డ నేహాల్ వధేరా.. తర్వాత భారీ షాట్లు ఆడి బెంగళూరు ఆశలపై నీళ్లు చల్లాడు. మ్యాక్స్‌వెల్ స్థానంలో ఈ మ్యాచ్ ఆడిన స్టాయినిస్.. 13వ ఓవర్ తొలి బంతికి సిక్సర్ బాది మ్యాచ్‌ను ముగించాడు.

బెంగళూరు విలవిల: మొదట వర్షం వల్ల మ్యాచ్ బాగా ఆలస్యంగా ఆరంభమైంది. ఒక దశలో మ్యాచ్ పూర్తిగా రద్దవుతుందేమో అన్న సందేహాలు కలిగాయి. కానీ వర్షం ఆగడంతో రాత్రి 9.50కి ఆట మొదలైంది. అప్పటిదాకా చినుకులతో తడిసిన స్టేడియాన్ని తమ బ్యాటర్లు పరుగులతో ముంచెత్తుతారని అభిమానులు ఆశిస్తే.. టపటపా పడ్డ వికెట్లతో దిమ్మదిరిగిపోయింది. బంతి బ్యాట్ మీదికి రాకపోవడం, ఔట్ ఫీల్డ్ మరీ నెమ్మదిగా ఉండడంతో షాట్లు ఆడడం చాలా కష్టమైంది. ఈ స్థితిలో ఆచితూచి ఆడాల్సిన బ్యాటర్లు.. బంతిని పదే పదే గాల్లోకి లేపి వికెట్లు ఇచ్చేశారు. తొలి బంతికి ఫోర్ కొట్టిన సాల్ట్ (4).. నాలుగో బంతికే ఔటైపోయాడు. అతణ్ని ఔట్ చేసిన అర్ష్‌దీప్.. తన తర్వాతి ఓవర్లో కోహ్లి (1)ని బుట్టలో వేశాడు. కెప్టెన్ రజత్ పాటీదార్ (23) ఓ ఎండ్‌లో నిలిచినా.. అతడికి సహకరించేవారే కరవయ్యారు. లివింగ్‌స్టన్ (4) ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. స్పిన్నర్ చాహల్ వచ్చాక ఆర్సీబీ బ్యాటర్ల పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగా తయారైంది. 3 ఓవర్లలో 11 పరుగులే ఇచ్చిన ఈ లెగ్‌స్పిన్నర్.. జితేశ్ (2), రజత్‌ల వికెట్లు పడగొట్టాడు. అతడితో బంతిని పంచుకున్న యాన్సెన్ సైతం తన వంతుగా రెండు వికెట్లు ఖాతాలో వేసుకోవడంతో ఆర్సీబీ 42/7కు చేరుకుంది. దీంతో తన పేరిటే ఉన్న ఐపీఎల్ అత్యల్ప స్కోరు (49)ని బెంగళూరు బద్దలుకొడుతుందా అన్న సందేహాలు కలిగాయి. అయితే టిమ్ డేవిడ్.. ప్రతికూల పరిస్థితుల్లో మెరుపు షాట్లు ఆడి ఆ ప్రమాదం తప్పించడమే కాక, జట్టుకు పోరాడే స్కోరు సాధించిపెట్టాడు. హర్‌ప్రీత్ బ్రార్ వేసిన చివరి ఓవర్లో డేవిడ్ హ్యాట్రిక్ సిక్సర్లు బాదడం విశేషం.

బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 4; కోహ్లి (సి) యాన్సెన్ (బి) అర్ష్‌దీప్ 1; రజత్ (సి) బార్ట్‌లెట్ (బి) చాహల్ 23; లివింగ్‌స్టన్ (సి) ప్రియాంశ్ (బి) బార్ట్‌లెట్ 4; జితేశ్ (సి) వధేరా (బి) చాహల్ 2; కృనాల్ (సి) అండ్ (బి) యాన్సెన్ 1; డేవిడ్ నాటౌట్ 50; మనోజ్ భండగే ఎల్బీ (బి) యాన్సెన్ 1; భువనేశ్వర్ (సి) బార్ట్‌లెట్ (బి) హర్‌ప్రీత్ 8; యశ్ దయాళ్ ఎల్బీ (బి) హర్‌ప్రీత్ 0; హేజిల్‌వుడ్ నాటౌట్ 0 ఎక్స్‌ట్రాలు 1 మొత్తం: (14 ఓవర్లలో 9 వికెట్లకు) 95

**వికెట్ల పతనం: 1-4, 2-21, 3-26, 4-32, 5-33, 6-41, 7-42, 8-63, 9-63**

**బౌలింగ్: అర్ష్‌దీప్ 3-0-23-2; బార్ట్‌లెట్ 3-0-26-1; యాన్సెన్ 3-0-10-2; చాహల్ 3-0-11-2; హర్‌ప్రీత్ బ్రార్ 2-0-25-2**

**పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (సి) డేవిడ్ (బి) హేజిల్‌వుడ్ 16; ప్రభ్‌సిమ్రన్ (సి) డేవిడ్ (బి) భువనేశ్వర్ 13; శ్రేయస్ (సి) జితేశ్ (బి) హేజిల్‌వుడ్ 7; జోష్ ఇంగ్లిస్ (సి) సుయాశ్ (బి) హేజిల్‌వుడ్ 14; నేహల్ వధేర నాటౌట్ 33; శశాంక్ సింగ్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 1; స్టాయినిస్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం: (12.1 ఓవర్లలో 5 వికెట్లకు) 98; వికెట్ల పతనం: 1-22, 2-32, 3-52, 4-53, 5-81**

**బౌలింగ్: భువనేశ్వర్ 3-0-26-2; యశ్ దయాల్ 2.1-0-18-0; జోష్ హేజిల్‌వుడ్ 3-0-14-3; కృనాల్ పాండ్య 1-0-10-0; సుయాశ్ శర్మ 3-0-25-0**

# నువ్వు చెస్ ఆడినట్లు చెప్పావు కదా: చాహల్‌తో ప్రీతీజింతా చిట్‌చాట్



**ఈ సీజన్ ఆరంభంలో కాస్త ఇబ్బంది పడిన యుజ్వేంద్ర చాహల్.. కీలక సమయంలో పుంజుకున్నాడు. గత మ్యాచ్‌లో (కోల్‌కతాపై) నాలుగు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టాడు.**

ఐపీఎల్ 2025 (IPL 2025) సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో పంజాబ్ కింగ్స్ తలపడేందుకు సిద్ధమైంది. మూడు రోజుల కిందటే సంచలన ప్రదర్శనతో కోల్‌కతా నైట్‌రైడర్స్ ను కట్టడి చేసిన పంజాబ్ సూపర్ విక్టరీ సాధించింది. యుజ్వేంద్ర చాహల్ 4/28 దెబ్బకు 112 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన కోల్‌కతా 95 పరుగులకే కుప్పకూలింది. ఇప్పుడు చిన్నస్వామి స్టేడియం వేదికగా బెంగళూరుతో తలపడనున్న క్రమంలో చాహల్ ప్రీతీ జింతా స్పెషల్ చిట్‌చాట్‌ను పంజాబ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. కోల్‌కతాపై అద్భుత ఫీట్ సాధించిన చాహల్‌ను ప్రీతి ప్రశంసలతో ముంచెత్తింది.

ప్రీతీజింతా: తక్కువ టార్గెట్ ఉన్న సమయంలో బౌలింగ్‌కు వచ్చినప్పుడు ఏమనుకున్నావ్?

చాహల్: ప్రత్యర్థి ఎదుట మనం తక్కువ లక్ష్యం ఉంచాం. ప్రత్యర్థి బ్యాటర్లను చూస్తే దాన్ని కాపాడుకోవడం తేలికగా అనిపించలేదు. పవర్ ప్లే చాలా కీలకమని భావించా. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో మాట్లాడినప్పుడూ ఇదే అనుకున్నాం. జట్టుగా మేం పోరాడాం.

ప్రీతి: మ్యాచ్ మొదలైన తర్వాత అసలేం జరుగుతోంది?అని అనిపించింది. అయితే, 2009లో డర్బన్ వేదికగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 119 పరుగులే మనం చేశాం. కానీ, వారిని 116 రన్స్‌కే కట్టడి చేశాం. ఇప్పుడు కూడా అదే జరగాలని మనసులో కోరుకున్నా. ఈ విషయంలో నీ ప్రదర్శన పట్ల గర్వంగా ఉంది. భారత్ తరఫున నువ్వు చెస్ కూడా ఆడినట్లు గతంలో చెప్పావు కదా?

చాహల్: అవును.. చెస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నా. ప్రీతి: నువ్వు తొలి వికెట్ తీసిన తర్వాత.. మ్యాచ్ ఫలితం గురించి ఏమనుకున్నావు?

చాహల్: నేను వికెట్ తీసిన తర్వాత విజయం సాధించేందుకు అవకాశం ఉందని భావించా. కెప్టెన్ శ్రేయస్ ఇచ్చిన స్వేచ్ఛతో ప్రత్యర్థిని కట్టడి చేయగలిగా. స్లిప్‌లో ఫీల్డర్ అవసరమా? అని శ్రేయస్ అడిగాడు. అవును, నాకు కావాలని చెప్పా. ఫీల్డర్ దగ్గరగా ఉంటే బ్యాటర్ ఒత్తిడికి గురవుతాడు.

ప్రీతి: ఆండ్రూ రస్సెల్‌ను ఔట్ చేసేందుకు ఎలాంటి వ్యూహం పన్నారు?

చాహల్: రస్సెల్ క్రీజ్‌లో ఉంటే.. మా నుంచి మ్యాచ్ లాగేసుకుంటాడని తెలుసు. అతడికి ఎక్కువగా స్ట్రైకింగ్ రాకుండా చేయగలిగాం. దీంతో టార్గెట్‌ను కాపాడుకునేందుకు చివరి వరకూ ప్రయత్నించి విజయవంతమయ్యాం.

ప్రీతి: బ్యాటర్లు విఫలమైనప్పుడు బౌలర్లు ముందుకొచ్చి డిఫెండ్ చేయగలిగితే నాతోపాటు అభిమానులూ చాలా సంతోషపడతారు.

చాహల్: మేం లక్ష్యాన్ని కాపాడుకోవడానికి ఎప్పుడూ పోరాడతాం మేడమ్. ఆ విషయంలో ఎలాంటి లోటు ఉండదని బలంగా చెప్పగలను.

ప్రీతి: ముస్ముందు చాలా కీలకమైన మ్యాచ్‌లు ఉన్నాయి. పంజాబ్ కింగ్స్ గతం గురించి నీకు తెలుసు. చాహల్.. నేను నీకు పెద్ద ఫ్యాన్‌ను అని ఇప్పటికే చెప్పా. అద్భుతంగా ఆడుతోన్న నీకు

# నా పేరిట స్టాండ్ అంటే..



**ఒకప్పుడు వాంఖడే స్టేడియంలో అడుగుపెట్టేందుకే తాను చాలా కష్టపడాల్సి వచ్చేదని.. ఇప్పుడు ఆ స్టేడియంలోని స్టాండ్‌కు తన పేరు పెడుతున్నారని.. ఇది అస్సలు నమ్మశక్యంగా లేదని టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు.**

ముంబయి: ఒకప్పుడు వాంఖడే స్టేడియంలో అడుగుపెట్టేందుకే తాను చాలా కష్టపడాల్సి వచ్చేదని.. ఇప్పుడు ఆ స్టేడియంలోని స్టాండ్‌కు తన పేరు పెడుతున్నారని.. ఇది అస్సలు నమ్మశక్యంగా లేదని టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. టీ20 ప్రపంచకప్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలిపిన రోహిత్‌శర్మతో పాటు టీమ్ఇండియా మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శరద్ పవార్‌ల పేర్లను వాంఖడే స్టేడియంలోని వివిధ స్టాండ్‌లకు పెట్టనున్నట్లు ముంబయి క్రికెట్ సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. "ముంబయి రంజీ జట్టు ప్రాక్టీస్ చేస్తుంటే చూసేందుకు అనుమతి కోసం వాంఖడే బయట నిల్చున్న రోజులు నాకింకా గుర్తున్నాయి. ఆజాద్ మైదానంలో అండర్-14 శిక్షణ ముగించుకుని.. ముంబయి రంజీ జట్టు ఆటగాళ్లను చూసేందుకు స్నేహితులతో కలిసి వాంఖడేకు వెళ్లేవాడిని. స్టేడియం లోనికి అనుమతి సాధించడం ఎంత కష్టమో నాకు తెలుసు. ఇప్పుడు స్టేడియంలో నా పేరిట ఓ స్టాండ్ ఏర్పాటు చేస్తున్నారంటే నమ్మశక్యంగా లేదు. ఇలా జరుగుతుందని ఎప్పుడూ ఊహించలేదు. నాకు ఈ గౌరవం ఇచ్చినందుకు నా జీవితాంతం రుణపడి ఉంటాను" అని రోహిత్ చెప్పాడు.


# సీఎస్‌కే అభిమానులకు అదిరిపోయే వార్త.. జట్టులోకి చిచ్చరపిడుగు



**ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తూ, పాయింట్ల పట్టికలో చిట్ట చివరి స్థానంలో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ తమ బ్యాటింగ్ విభాగాన్ని పటిష్ట పరచుకునే పనిలో పడింది. ఇప్పటికే గాయపడిన కెప్టెన్ రుతురాజ్ స్థానాన్ని ముంబై యువ సంచలనం ఆయుశ్ మాత్రేతో భర్తీ చేసిన సీఎస్‌కే యాజమాన్యం తాజాగా మరో గాయపడిన ఆటగాడికి రీప్లేస్‌మెంట్‌ను ప్రకటించింది.**

లెఫ్ట్ ఆర్మ్ మీడియం ఫాస్ట్ బౌలర్ అయిన గుర్జప్నీత్ సింగ్ ఈ సీజన్ ఆరంభ దశలో గాయపడగా.. తాజాగా అతని స్థానాన్ని సౌతాఫ్రికా చిచ్చరపిడుగు, బేబీ ఏబీడీగా పిలువబడే డెవాల్డ్ బ్రెవిస్‌తో భర్తీ చేసింది. బ్రెవిస్ ఈ సీజన్ మెగా వేలంలో 75 లక్షల బేస్ ధర విభాగంలో తన పేరు నమోదు చేసుకున్నప్పటికీ.. సీఎస్‌కే మేనేజ్‌మెంట్ అతనికి బంపరాఫర్ ఇచ్చి ఏకంగా రూ. 2.2 కోట్లకు డీల్ సైన్ చేసుకుంది. వాస్తవానికి ఈ సీజన్‌లో సీఎస్‌కేకు ఓ ఓవర్సీస్ బెర్త్ ఖాళీగా ఉంది. ఎవరికీ రీప్లేస్‌మెంట్‌గా కాకుండానే బ్రెవిస్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఆ జట్టుకు ఉండింది. అయినా ఎందుకో వేచి చూసే ధోరణిని అవలంభించి గుర్జప్నీత్‌కు ప్రత్యామ్నాయంగా ఎంపిక చేసుకుంది. విధ్వంసకర వీరుడిగా పేరు తెచ్చుకున్న బ్రెవిస్‌ను ఈ సీజన్ మెగా వేలంలో ఎందుకో ఏ జట్టు ఎంపిక చేసుకోలేదు. బ్రెవిస్ గతంలో ముంబై ఇండియన్స్‌కు ఆడాడు. సౌతాఫ్రికా టీ20 లీగ్, మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీల్లోనూ అతను ముంబై సిస్టర్ ఫ్రాంచైజీలకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. 21 ఏళ్ల బ్రెవిస్ సౌతాఫ్రికా తరఫున కేవలం రెండు మ్యాచ్‌లే ఆడినప్పటికీ.. అతన్ని ఆ దేశ దిగ్గజ ఆటగాడు ఏబీ డివిలియర్స్‌తో పోలుస్తారు. బ్రెవిస్ ఓవరాల్‌గా 81 టీ20లు ఆడి 145 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు చేశాడు. బ్రెవిస్ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు. సౌతాఫ్రికా దేశవాలీ సీజన్‌లో ఫార్మాట్లకతీతంగా అదరగొట్టాడు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన సౌతాఫ్రికా టీ20 లీగ్‌లోనూ బ్రెవిస్ మంచి ప్రదర్శనలు చేశాడు. బ్రెవిస్ ఫామ్ కష్టాల్లో ఉన్న సీఎస్‌కేను గట్టెక్కిస్తుందేమో చూడాలి. సీఎస్‌కే తమ తదుపరి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి ముంబై ఇండియన్స్‌ను ఢీకొట్టబోతుంది. ఈ మ్యాచ్ వాంఖడే వేదికగా ఏప్రిల్ 20న జరుగనుంది. ఈ సీజన్‌లో సీఎస్‌కే తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసి ఆతర్వాత వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడింది. తాజా లక్నోతో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే మళ్లీ గెలుపు గుర్రం ఎక్కింది. ఈ సీజన్‌లో సీఎస్‌కే ఏడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు మాత్రమే సాధించి, నాలుగు పాయింట్లతో అట్టడుగు స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో సీఎస్‌కే బ్యాటింగ్ విభాగంలో చాలా బలహీనంగా కనిపిస్తుంది. రుతురాజ్ వైదొలగడంతో ఆ జట్టు కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. ఆయుశ్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్ చేరికతో సీఎస్‌కే బ్యాటింగ్ కష్టాలు తీరుతాయేమో చూడాలి. ఈ సీజన్‌లో సీఎస్‌కే బౌలింగ్‌లో పర్వాలేదనిపిస్తుంది. రుతరాజ్ గైర్హాజరీలో సీఎస్‌కే కెప్టెన్‌గా ధోని వ్యవహరిస్తున్నాడు. లక్నోపై గెలుపులో ధోని కీలకపాత్ర పోషించాడు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్, రవీంద్ర జడేజా, ఖలీల్ అహ్మద్, పతిరణ అద్భుతంగా రాణిస్తున్నారు.

# ఇవారా పేరు పెట్టిన కేఎల్ రాహుల్.. అర్థం ఏంటో తెలుసా..?



**తన పుట్టిన రోజు సందర్భంగా కేఎల్ రాహుల్ తన కుమార్తె పేరును ప్రకటించాడు. ఆమెకు ఇవారా అని పేరు పెట్టినట్లు తెలిపాడు.**

టీమ్ఇండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ పుట్టిన రోజు నేడు. పలువురు క్రికెటర్లు, అభిమానులు అతడికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని రాహుల్ , నటి అతియా శెట్టి దంపతులు ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. ఇటీవలే తమ జీవితాల్లోకి వచ్చిన తమ గారాలపట్టిని ప్రపంచానికి పరిచయం చేసిన ఈ జంట.. ఆమె పేరును ప్రకటించింది. తమ కుమార్తెకు ఇవారా అని పేరు పెట్టినట్లు చెప్పారు. చిన్నారిని ఎత్తుకున్న ఫొటోను షేర్ చేసిన రాహుల్ దంపతులు.. "మా బేబీ గర్ల్.. మా ప్రపంచం. ఇవారా - భగవంతుడి కానుక" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం నెట్టింట ఈ పోస్ట్ తెగ వైరల్ అవుతోంది. రాహుల్, అతియాకు అభిమానులు మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 'ఇవారా' అనేది సంస్కృత మూలాలున్న పేరు. దేవుడిచ్చిన ప్రసాదంగా అభివర్ణిస్తూ.. కవిత్వాల్లో ఎక్కువగా ఈ పేరును ఉపయోగిస్తారు.

నువ్వు చెస్ ఆడినట్లు చెప్పావు కదా: చాహల్‌తో ప్రీతీజింతా చిట్‌చాట్రాహుల్ సతీమణి అతియా శెట్టి మార్చి 25న పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ప్రేమికులైన ఈ జంట 2023లో వివాహ బంధంతో ఒక్కటైంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో రాహుల్ దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. భార్య ప్రసవం నేపథ్యంలోనే ఈ సీజన్‌లో దిల్లీ ఆడిన తొలి మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. ఇక, సునీల్‌శెట్టి వారసురాలిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన అతియా.. 'హీరో', 'ముబారకన్', 'మోతీచూర్ ఛక్నాచూర్'లో నటించారు.

# అసభ్యకర ఫొటోలు పంపేవారు.. ఆ సీనియర్ క్రికెటర్

**టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ బిడ్డ అనయా బంగర్ సంచలన ఆరోపణలతో వార్తల్లో నిలిచింది. తాను ఆర్యన్ గా ఉన్నపుడు క్రికెటర్లతో మంచి అనుబంధం ఉండేదని.. అయితే, అనయాగా మారిన తర్వాత కొంత మంది నిజస్వరూపాలు బయటపడ్డాయంటూ విస్మయకర విషయాలు వెల్లడించింది. సీనియర్ ఆటగాడు ఒకరు తనకు అండగా మాట్లాడినట్లు నటించి.. తనతో నిద్రించాలని ఉందంటూ అసభ్యంగా ప్రవర్తించాడని పేర్కొంది.** అమ్మాయిగా మారిపోయిన ఆర్యన్



కాగా టీమిండియా మాజీ కోచ్ అయిన సంజయ్ బంగర్ కశ్మీర దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో ఆర్యన్ పెద్దవాడు. అతడు కూడా తండ్రి బాటలోనే క్రికెటర్‌గా ఎదగాలనే ఆశయంతో దేశీ టోర్నీల్లో ఆడాడు. కానీ శరీర ధర్మానికి అనుగుణంగా తాను అబ్బాయిని కాదు.. అమ్మాయినని గుర్తించి హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ చేయించుకున్నాడు. తద్వారా అమ్మాయిగా మారిపోయిన ఆర్యన్.. అనయా బంగర్‌గా కొత్త పేరుతో ముందుకు వచ్చాడు. ప్రస్తుతం అనయా యునైటెడ్ కింగ్‌డమ్‌లో జీవిస్తోంది. ఈ క్రమంలో తాజాగా 'లలన్‌టాప్'నకు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. క్రికెట్ ప్రపంచంలో ఎంతో మంది విషపూరితమైన మగాళ్లు ఉన్నారంటూ అనయా బంగర్ సంచలన విషయాలు వెల్లడించింది. నేను అమ్మాయిని.. అమ్మాయిలాగే ఉండాలి "నాకు అప్పుడు ఎనిమిది తొమ్మిదేళ్ల వయసు ఉంటుంది. మా అమ్మ కబోర్డ్‌లోని దుస్తులు తీసుకుని వేసుకునే వాడిని. అద్దంలో చూసుకుని మురిసిపోయేవాడిని. అప్పుడే నాకు.. 'నేను అమ్మాయిని.. అమ్మాయిలాగే ఉండాలి' అనే కోరిక కలిగింది. దేశీ క్రికెట్లో నేను ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, యశస్వి జైస్వాల్ వంటి ప్రసిద్ధ క్రికెటర్లతో ఆడాను. అప్పుడు నా శరీర ధర్మం గురించి బయటపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునేవాడిని. ఎందుకంటే. .నాన్నకు క్రికెటర్‌గా, టీ మిం డి యా కోచ్‌గా గొప్ప పేరుంది. అందుకే నా విషయాన్ని దాచాల్సి వచ్చింది. క్రికెట్ ప్రపంచం మొత్తం అభద్రతాభావం, మగాళ్ల ఆధిపత్యంతో నిండిపోయింది. దుస్తుల్లేకుండా ఫొటోలు పంపేవారు నా గురించి తెలిసిన తర్వాత కొంత మంది మంచి మాటలు చెబుతూ అండగా నిలబడ్డారు. మరికొందరు మాత్రం వేధించారు. అప్పుడప్పుడు దుస్తుల్లేకుండా వారి ఫొటోలు నాకు పంపించేవారు. ఓ వ్యక్తి అయితే అందరి ముందు నన్ను తిట్టేవాడు. ఆ తర్వాత నా దగ్గరికి వచ్చి వ్యక్తిగత ఫొటోలు పంపమని అడిగేవాడు. ఇంకో సందర్భంలో ఓ వెటరన్ క్రికెటర్ తన బుద్ధిని బయటపెట్టాడు. పద కార్లో కూర్చో.. నీతో కలిసి నా పరిస్థితి గురించి అతడికి చెప్పగానే.. 'పద కార్లో కూర్చో.. నీతో కలిసి నిద్రించాలని నాకు ఆశగా ఉంది' అంటూ చెత్త మాటలు మాట్లాడాడు" అని అనయా బంగర్ తాను ఎదర్కొన్న చేదు అనుభవాల గురించి పంచుకుంది.